# సద్గురు బోధలో జగద్గురు గీత

## 3వ అధ్యాయం

సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



*సద్గురు బోధలో జగద్గురు గీత*

*3వ ఆధ్యాయం*

సాయి సచ్చరిత్ర మూడవ అధ్యాయంలో హేమడ్ పంతు ద్వారా పలికించిన మాటలు ఇంకా చూద్దాం. "యోగీశ్వరుల కథలు పవిత్రములు. అవి మన చెవుల ద్వారా హృదయంలో ప్రవేశించినప్పుడు శరీర స్పృహ, అహంకారము, ద్వంద్వభావాలు నశిస్తాయి. మన హృదయములో నిల్వ ఉండిన సందేహాలు పటాపంచలైపోతాయి. శరీర గర్వము మాయమైపోయి కావలసినంత జ్ఞానము నిల్వచేయబడుతుంది. శ్రీ సాయిబాబా కీర్తి, వర్ణనలు ప్రేమతో పాడినా, విన్నా భక్తుని పాపాలు పటాపంచలు అవుతాయి. కాబట్టి ఇవే మోక్షానికి సులభ సాధనాలు"

ఈ విషయాలలోకి లోతుగా వెళ్ళే ముందు అసలు బాబా, అలాగే కృష్ణయ్య ఈ మానవాళికి ఇచ్చిన గొప్ప కానుక ఏమిటో చూద్దామా.

భగవద్గీత ఎన్నో యుగాల క్రితం సాక్షాత్తు శ్రీకృష్ణుల వారే స్వయంగా అర్జునుడిని ఉద్దేశించి చెప్పింది కాగా (భగవతా నారాయణేన స్వయం) దానిని కాలాంతరంలో వేదవ్యాసుల వారు గ్రంధస్థం చేశారు.

ఇక సాయి బోధ అయితే ఇంచుమించు మనందరం ఉన్న రోజులలోనే బాబా వారు ఈ రోజున్న పరిస్థితులు, మన మానసిక, శారీరిక, బుద్ధి పరికత్వని బట్టి అందరికి అర్ధం అయ్యేలా మానవాళిని ఉద్దేశించి చెప్పగా, దానిని హేమడ్ పంతు గ్రంధస్థం చేశాడు.

రెండూ ఆత్మోన్నతికి తోడ్పడేవే. రెండిటి ధ్యేయం మనల్ని జనన మరణ చక్రం నించి బయట పడేయడమే. చెప్పిన ఇద్దరూ యోగీశ్వరులే. ఒకరు సనాతన పురుషుడైతే, మరొకరు ఆది అంతం లేని సత్త్వస్వరూపుడు. మరి అటువంటి వారి కధలు మనల్ని తరింప చేస్తాయి అనడంలో సందేహం ఏముంది.

జన్మ కర్మ చ మే దివ్యమ్
ఏవం యో వేత్తి తత్త్వతః ।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి
మామేతి సొఽర్జున ।। 4-9 ।।

నా యొక్క జన్మ మరియు కర్మల దివ్య స్వభావాన్ని ఎవరైతే అర్థంచేసుకుంటారో, ఓ అర్జునా, వారు తమ దేహం విడిచిపెట్టిన తరువాత తిరిగి జన్మనెత్తరు, నా నిత్యశాశ్వత ధామానికే వస్తారు.

శ్రీ కృష్ణుల వారు నుడివిన ఈ భావాన్నే బాబా వారు హేమడ్ పంతు మాటల్లో పలికారు. అటువంటి యోగీశ్వరుల దర్శనం కూడా మనలో ఉన్న అరిషడ్వర్గాలను నియంత్రించి మనకు ఒక ఉన్నత మార్గాన్ని మనకు తెలీకుండానే సుగమం చేస్తుంది అన్నది సాధకులకు ఎందరికో అనుభవైకవేద్యమే.

యోగీశ్వరులందరూ తమ వద్దకు చేరిన ప్రతీ జీవి యొక్క ఉద్ధరణకి ఇచ్చే గొప్ప సందేశం ఏమిటో చూద్దామా.

యే యథా మాం ప్రపద్యంతే
తాంస్తథైవ భజామ్యహమ్!
మమ వర్త్మానువర్తంతే
మనుష్యాః పార్థ సర్వశః ।। 4-11

నాకు ఏ ప్రకారంగా మనుజులు శరణాగతి చేస్తారో, నేను వారికి ఆ విధంగా ప్రతిస్పందిస్తాను. తెలిసినా, తెలియకపోయినా, అందరూ నా మార్గాన్ని అనుసరించాల్సిందే, ఓ అర్జునా!

శరణాగతి చేసిన వారి అనంత జన్మల సంచిత కర్మను నాశనం చేసి, వారిలో వచ్చిన

మార్పుతో ఆగామి నియంత్రించబడి, ప్రారబ్ధ భోగానికి మాత్రమే శరీర యాత్రను కొనసాగింప చేసి, తమని శరణుపేడిన వారి మాయా బంధనాలు తొలగించి, వారికి దివ్య జ్ఞానాన్ని బోధించడమే యోగుల లక్షణం.

వారి కేవల దర్శన-స్పర్శన అవతలవారి లోని మలినాలని తొలగించి, వారిలో సమబుద్ధి, ద్వంద్వాతీత భావన నింపి; వారిలోని అసూయ, అహంకారం ఇత్యాది భావాల్ని సమూలంగా నిర్మూలించి ఉద్ధరిస్తారు. అలా ఉద్ధరింప బడిన రోజున మనం ఎలా ఉంటామో గీతలో కృష్ణుడు ఈ పదాల్లో చెప్తే, దానినే బాబా వారు పలు బోధలలో మనల్ని ఉండమని శాసించారు.

యదృచ్ఛాలాభసంతుష్టో
ద్వంద్వాతీతో విమత్సరః ।
సమః సిద్ధావసిద్ధౌ చ
కృత్వాపి న నిబధ్యతే ।। 4 - 22

అప్రయత్నముగానే లభించిన దానితో సంతృప్తి చెంది, అసూయారహితులై, వారు జీవన ద్వంద్వములకు (సుఖ-దుఃఖాలు, లాభ-నష్టాలు వంటివి) అతీతులై ఉంటారు. అన్ని విధముల పనులు చేస్తూనే ఉన్నా, గెలుపు-ఓటమిలలో సమత్వ బుద్ధి తో ఉండి, వారు తమ కర్మలచే బంధింపబడరు.

*ద్వంద్వాతీత భావం అంటే సుఖ దుఃఖాలను ఒకేలా తీసుకోగలగడం.
*సమబుద్ధి అంటే మిత్రులను-శత్రువులను ఒకేలా చూడడం.
*బుద్ధి యోగం అంటే అన్ని పరిస్థితులలోను ఒకేలా ఉండదగలగడం. ఇవన్నీ చదవడానికే కాదు, ఎదురు పడితే గాని పూర్తిగా అర్థం కాని తత్వాలు.

మరి అర్థం కావడం ఎలా?

అందుకై ఉన్నవే ఈ సచ్చరిత్ర పారాయణాలు, రామాయణ - భారత – భారత - భాగవత వాఙ్మయాలు.

వీటిద్వారా మనం అనుకూల, ప్రతికూల పరిస్థితులలో మహానుభావులు ఎలా ప్రవర్తించారు, లేదా వారి వద్దకు వచ్చిన వారి ఆ పరిస్థితులకు ఎలాంటి పరిష్కారం చూపించారు, ఎలా స్థితప్రజ్ఞులుగా ఉన్నారు అన్నది తెలియ చేసి, ఒక మార్గాన్ని చూపుతాయి.

కృష్ణ బోధనో, బాబా వారి మాటనో అనుసరించడం వల్ల వచ్చే లాభం ఏమిటి అంటే ఆయన దివ్య ప్రేమను పొందడం.

ఎందుకంటే మనం మనలో ఉంది అని మిడిసిపడే “బుద్ధి కుశలత, జ్ఞానము, ఆలోచనలో స్పష్టత, దయ, నిజాయితీ, మనస్సు-ఇంద్రియ నిగ్రహణ, సుఖ-దుఃఖాలు, జనన-మరణాలు, భయము-ధైర్యము, అహింస, సమత్వం, తృప్తి, తపస్సు, దానము, కీర్తి-అపకీర్తి” ఇత్యాది వైవిధ్యాలన్నీ కూడా ఆ భగవంతుడి నించి వచ్చినవే కాబట్టి.

ఎప్పుడైతే మనం వారు నుడివిన మార్గం లో పడతామో, మన జీవోద్ధారణ జరిగి, ఆత్మోన్నతి కన్న సాధన మరింత మెరుగుపడి, మనం తత్ -త్వం-అసి అన్న భావనని అనుభవించ గలుగుగాము.

గత మూడు రోజుల క్రితం సత్సంగంలో సాయి విఠల్ గారు “సాయి మాటలు వినడానికి చెవులు, వారి దర్శనానికి కళ్ళు, ఆతురుతతో ఎదురు చూస్తుంటే, మనసు ధ్యానాన్ని దాటి సహజంగా ధ్యానం లో ఉంది పోతుంది” అని పెట్టారు.

నిజంగానే కూడా అదే జరిగింది. గత మూడు నాలుగు రోజులుగా పని ఒత్తిడి లో వ్రాయలేక పోయాను. అదే ధ్యాస నడుస్తూనే ఉంది. అదీ ఒక ధ్యానమే కదూ.

ఎందుకంటే భక్తుడి ద్వారా పలికించిన ఇదే భావం మనకి శ్రీకృష్ణుల వారు ఒక మంచి శ్లోకం

లో ఇలా తెలియచేస్తున్నారు.

మనః ప్రసాద సౌమ్యత్వం మౌన మాత్మ వినిగ్రహః
భావ సంశుద్ధి రిత్యేత త్తపో మానసముచ్యతే ||గీత 17-16

మనస్సు స్వచ్ఛముగా నుంచుకొనుట, క్రూరభావము లేకుండుట, వాఙ్నియమము, మనోనిగ్రహము, నిష్కపట స్వభావము ఇవి మానసిక తపస్సు.

ఒక విధంగా మనం బాబా కథలు, మాటలు, ఇత్యాదుల గురించి ఎదురుచూస్తున్నాం అంటే ఆయనపై ధ్యానం లో ఉన్నట్లే. దానికి శ్రద్ధ – సబూరి తోడైతే అది మానసిక తపస్సు అవుతుంది.

ఇక విషయానికి వస్తే *బాబావారు మూడవ అధ్యాయం* లో అన్న మాట చూద్దాం "ఎవరయితే నన్ను శరణు కోరుతారో, భక్తివిశ్వాసములతో నన్ను పూజిస్తారో, నన్నే స్మరిస్తారో, నా రూపమును తమ మనస్సులో నిలుపుకుంటారో, వారిని దుఃఖ బంధనాలనుండి తప్పిస్తాను. ప్రాపంచిక విషయాలన్నింటినీ మరచి, నా నామాన్నే జపిస్తూ, నా పూజనే చేస్తూ, నా లీలలను, చరిత్రమును మననం చేస్తూ ఎల్లప్పుడూ నన్ను జ్ఞాపకం ఉంచుకుంటారో వారు ప్రపంచ విషయాలలో ఎలా ఇరుక్కుంటారు? వారిని మరణమునుండి బయటకు లాగుతాను. నా కథలు వింటే సకల రోగములు నివారింప బడతాయి. కాబట్టి భక్తిశ్రద్ధలతో నా కథలను వినండి. వాటిని మనస్సులో నిలుపుకోండి. ఆనందమునకు తృప్తికి ఇదే మార్గము. నా భక్తులయొక్క గర్వ అహంకారాలు నిష్క్రమిస్తాయి. నా లీలలు వినేవారికి శాంతి కలుగుతుంది. మనః పూర్వకంగా నమ్మకము ఉన్నవారికి శుద్ధ చైతన్యముతో తాదాత్యము కలుగుతుంది. 'సాయి సాయి' అను నామాన్ని జ్ఞాపకము ఉంచుకున్నంత మాత్రాన, చెడు పలుకడం వలన, వినటం వల్ల కలిగే పాపాలు తొలగిపోతాయి."

బాబా వారు జీవన విధానం చూస్తె మనకి ఏ ఉదంతం తిరగేసినా మన ఎదురుగా తన భక్తుల బాధలను నియంత్రించ డానికి,  వారి కుకర్మలను, అరిషడ్వర్గాలను, సంచితాన్ని,

బాధలను ధునిలో వేస్తూ, సబ్ కా మాలిక్ ఏక్ అంటూ జపిస్తూ, తన దగ్గరకు చేరిన భక్తులకు సుబోధ చేస్తూ  ఉండే బాబా నే తప్ప, ఏ కర్మ చేయకుండా అలా సేద తీరుతున్న, లేదా అచేతనంగా ఉన్న సాయి మనకు దర్శనం కాదు. అంటే అక్కడ కర్మ నడుస్తూనే ఉంది.  అదీ సత్కర్మ, పది మందికి కళ్యాణ ప్రదాయిని అయిన కర్మ.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. నిజంగా అయితే బాబా వారికి, శ్రీకృష్ణ భగవానుడికి వారికి ఏ కర్మ చేసుకోవాల్సిన పని లేదు. ఎందుకంటే ఈ సృష్టి వారి అధీనం లో ఉంది. మాయ వారి పనిముట్టు. యోగ మాయ వారి సహచరి. వారు సాక్షాత్తు భగవానులు. ఈ సృష్టికి వీరిపురు సాక్షి భూతులే తప్ప కర్మలు చేయాల్సిన అవసరం లేని వారు. అంటే కాక ఈ సృష్టి అంతా వారి అధ్యక్షతచేతనే నడుస్తోంది.

శ్లో|| మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే స చరాచరమ్
హేతు నానేన కౌన్తేయ జగద్విపరివర్తతే ||

అటువంటి వారికి చేయాల్సిన కర్మ అంటూ ఏది లేదు. అయితే వారు కర్మ ఎందుకు చేస్తున్నారు అంటే మనలాంటి వారికి ఆదర్శంగా ఉంటూ, కర్తవ్యమ్ ఎలా, ఏ భావం తో చెయ్యాలో బోధించడానికి. ఫలితం గా ఇలా ఉంటే నేను నిన్ను తరింప చేస్తాను, రక్షిస్తారు, ఉద్ధరిస్తారు అంటూ భరోసా ఇస్తూ, మనకి తెలీకుండానే మనల్ని మనం తరింప చేసుకునే ఆదర్శ వంతమైన మార్గాన్ని వారు మాటల్లో, చేతల్లో మనకి చూపించడమే వారి అవతార రహస్యం,

కర్మలే మన జన్మకి కారణం అని తెలుసుకున్నాము. అలాగే కర్మలు చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేము అని మనకీ తెలుసు, గీతా బోధించింది, అలాగే బాబా వారూ తమ ఆచరణలో చూపారు. అయితే ఏ కర్మ మనల్ని తరింప చేస్తుంది అన్నది, మన శారీరిక పరిశ్రమ కన్నా మన భావం పై ఎక్కన ఆధారపడి ఉంటుంది.

అందువల్ల అసలు కర్మలు, వాటి విధి విధానాలు ఎలా ఉండాలి అన్నది బాబా బోధించిన

విధానం, దానికి కృష్ణుడు నుడివిన మార్గం తో చూద్దాం.

ముందుగా కర్మ రెండు విధములు.

ఎ) సత్కర్మ.

బి) అసత్కర్మ.

కర్తృత్వభావనతో చేసినప్పుడే అవి కర్మలగును.

ఎ) సత్కర్మ:- వేదోక్తములైన యజ్ఞయాగాదులు, నిత్య నైమిత్తిక కామ్యకర్మలు, వర్ణాశ్రమ ధర్మానుసార కర్మలు మొదలగు కర్మలను శ్రద్ధతో చేసిన అవి సత్కర్మలు అనబడును.

బి) అసత్కర్మ:- పై కర్మలను అశ్రద్ధతో జేసిన అసత్ కర్మలనబడును.

*బాబా వారు శ్రద్ధ - సబూరి - ప్రేమ – సర్వభూతదయ- నామ సంకీర్తన – భగవన్నామ స్మరణ ఇత్యాదుల ద్వారా మనల్ని సత్కర్మాచరణం బోధించారు.* అంటే మానవుడు ఆత్మోన్నతిని సాధించాలి అంటే సత్కర్మ లే చేయాలి. తనకి ఉపయోగ పడుతూనే, పది మందికి ఉపయోగ పడే పనులే చేయాలి. బాబా వారు ఆచరణలోనూ, శ్రీకృష్ణుడు భగవద్గీతలో 4వ అధ్యాయము లోనూ (కింకర్మ కిమకర్మేతి అన్న శ్లోకం లో) ఎట్టి కర్మ నాచరించి మానవుడు సంసార బంధమునుండి విముక్తి కాగలుగుతాడో వివరించిన విషయం చూద్దాము.

శ్లో|| కవయో ప్యత్ర మోహితాః
తత్తే కర్మ ప్రవక్ష్యామి యజ్ఞాత్వా మోక్షసే శుభాత్ ||
గీత 4-16

కర్మ ఏదో అకర్మ ఏదో పండితులు కూడ తెలిసికొనజాలరు. కర్మను గూర్చి తెలిసికొన్న ఎడల సంసార బంధమునుండి విముక్తుడ వగుదవు.

శ్లో|| కర్మణో హ్యపి బోద్ధవ్యం
బోద్ధవ్యంచ వికర్మణః
అకర్మణశ్చ బోద్ధవ్యం
గహనా కర్మణో గతిః
గీత 14-17

కర్మను గురించి, వికర్మను గురించి, అకర్మనుగురించి తెలిసికొన వలయును. కర్మమార్గము దురవగాహనం ఐనది. కేవల శారీరక కర్మలు భోగానంతరము వదలును. అహంకారముతో కామముతో చేయబడిన కర్మలు బంధహేతువులగును.
కర్మ లు మూడు విధాలుగా ఉంటాయి.

1) కర్మ 2) వికర్మ 3) అకర్మ

1.కర్మ - సత్‌కర్మ యజ్ఞ దాన తపఃకర్మలు శ్రద్ధతో చేయుట.

అసత్‌కర్మ - యజ్ఞ దాన తపః కర్మలు అశ్రద్ధతో చేయుట

2.వికర్మ- వేదనిషిద్ధకర్మలు లేక సోమరితనంతో కర్మ చేయకుండుట

3.అకర్మ- నిస్వార్థబుద్ధితో చేయు యజ్ఞ దాన తపః కర్మలు

అలాగే మన కర్తవ్యాలు కూడా
1 శ్రుతి ప్రోక్తములు – అంటే
వైదిక, యజ్ఞయాగాది కర్మలు

2 స్మృతి ప్రోక్తములు – అంటే వర్ణాశ్రమ కర్మలు

3 పౌరాణిక ధార్మికములు – వ్రతములు, ఉపవాసములు, స్మార్త, నిత్య సంధ్యావంద

నాదులు, నైమిత్తికాలు, గ్రహశాంతి ఇత్యాదులు గా ఉన్నాయి.

ఇవన్నీ మనకు శాస్త్ర రూపం గా చెప్పకుండా దానిని ఆచరణలుగ ప్రతీ కథలోనూ మనకి సూచించారు.

వర్ణాశ్రమ కర్మలు అంటూ పండితులే కొట్టుకునే మాటలు వాడకుండా ఎవరు ఏది చేస్తే అదే చేయమని, ఎవరు ఏది తింటే అదే తినమని, ఎవరు ఏ ధర్మాన్ని అనుసరిస్తే అదే స్వధర్మమని, వారి వ్యక్తిత్వాన్ని బట్టి వచ్చేదే వారి సహజ ధర్మమని, ఎలా ఉన్న వారిని అలాగే ఉంటూ ఎలా జీవన గతిని మార్చుకోవచ్చో మనకి చేతల్లో చూపారు బాబా వారు.

మనకి ఆనందాన్ని కలిగించేదే అవతల వారికి చేయమని, మనకి హాని కలిగించే పని అవతల వారికి చేయొద్దని, నీ చుట్టూ చేరే కుక్క, పిల్లి లలోనూ సర్వాంతర్యామిని దర్శించమని బోధిస్తూ మనకి ఆత్మ తత్వాన్ని  చాల విడమర్చి బోధించారు.  ఆత్మకు పరమాత్మ కు ప్రక్రుతి తో తాదాత్మ్యం వల్ల ఉన్న బేధం తప్ప మరేదీ లేదని చూపారు.

మన ఎదురుగా ఉన్న బాబా, మనం ఉన్న పరిస్థితుల లోనే ఉంటూ ఏ స్థితి లో మాయకు లోబడకుండా, ఒక తాదాత్మ్య స్థితిలో ఉన్నారో మనం కథలలో విన్నాము. మరి మనం ఆ సమయం లో ఏ స్థితిలో ఉన్నాం, ఉంటున్నాం అన్నది మనకే అనుభవ గ్రాహ్యమే. ఒక పక్క భగవంతుడు. మరొక పక్క జీవుడు. ఇద్దరూ ఉన్న పరిస్థితి ఒక్కటే. మార్పు ఉందంటే ఆలోచన, అవగాహన.

అంతర్యామిని దర్శించ లేక పోవడమే మన భావ దారిద్ర్యం అయితే. మన మీద కరుణతో ఆ అంతర్యామి బయటకు బాబా రూపం లో ఉండి, బోధించిన మార్గాన్ని కూడా సరైన అవగాహన తో చూడలేక పోవడం మనకై మనం వదిలించుకోలేక పోతున్న మాయ ప్రభావం. మరి దీని నించి బయట పడడం ఎలా.

శ్లో|| నియతం సంగ రహిత మరాగ ద్వేషత కృతమ్

అఫల ప్రేప్సునా యత్త త్సాత్విక ముచ్యతే.  గీత 18-23

తనకు విధించబడియుండు కార్యమును, తాను కర్తయను అభిమానము లేకను, దాగద్వేషములులేకను నియయముచేత స్వధర్మాను సారముగా చేయడం (సాత్విక కర్మ).

శ్లో|| ముక్త సంగోనహం వాదీ ధృత్యుత్సాహ సమన్వితః
సిధ్ధ్యసిధ్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్విక ఉచ్యతే!  గీత 18-26

ఫలాపేక్షలేక తాను కర్తయను అభిమానములేక కార్యము సిద్ధించినను సిద్ధించక పోయినను మనస్సున వికారము జెందక సమబుద్ధి గల వాడై ధైర్యోత్సాహములు వదలకుండా (సాత్విక కర్త) ఉండడం

బాబా వారు మనకు బోధచేస్తూనే ధునిలో మన కర్మలను దగ్ధం చేసేందుకై (తాను ఎంచుకున్న మార్గం) చేస్తూ భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లుగానే (యజ్ఞదాన తపః) కర్మలను వదలకూడదని బోధించెను. ఆ కర్మల నిజస్వరూపాన్ని మనకు వివరించారు. కర్మను ఏ భావంతో చేయాలో చెప్పిన ఇంకో శ్లోకం చూసి ముగిద్దాం.

శ్లో|| అశ్రద్ధ యా హుతం దత్తం స్తప్తం కృతంచ యత్!
అస దిత్యుచ్యతే పార్థః నచతత్ప్రేత్య ఇహ!! గీత 17-28

అశ్రద్ధతో చేయబడిన హోమము దానము తపస్సు కర్మము ఇది అసత్తని చెప్పబడును. ఇవి ఇహమందును పరమందును సుఖకరములు కావు. కాన కర్మలను శ్రద్ధతో చేయవలెను.

అంటే చేసే ఏ కర్మ కూడా శ్రద్ధ తో చేయబడని నాడు అది సరైన ఫలితాన్ని ఇవ్వదు. ఇంతటి గొప్ప శాస్త్ర విషయః జనులందరికి చేరేలా శ్రద్ధ – సబూరి అని బోధించారు.

ఈ కర్మలు చేస్తే ఎలా తరింపచేస్తాను అన్నారో తెలుసుకుందాం.

"నా లీలలను గానం చేసే వారికి అంతులేని ఆనందమును, శాశ్వతమైన తృప్తిని ఇస్తానని నమ్మండి. ఎవరయితే నన్ను శరణు కోరుతారో, భక్తివిశ్వాసములతో నన్ను పూజిస్తారో, నన్నే స్మరిస్తారో, నా రూపమును తమ మనస్సులో నిలుపుకుంటారో, వారిని దుఃఖ బంధనాలనుండి తప్పిస్తాను".

ఇందులో బాబా వారు తనను శరణుజొచ్చిన వారికి అంతులేని ఆనందాన్ని, తృప్తిని ఇస్తానని, దుఃఖాల నుంచి తప్పిస్తానని చెప్తున్నారు. ఇక్కడ ఒక సూక్ష్మాన్ని అర్థం చేసుకోవాలి. మనం ఎప్పుడైనా ఎవరికైన మనకి ఉన్నదే ఇవ్వగలం కదూ. లేనిది ఎక్కడి నించి ఇస్తాము. అలాగే సాక్షాత్తు తానూ నిరతిశయ, శాశ్వత ఆనంద స్వరూపుడు అయితే గాని దానిని వేరే వారికి ఒసగడం కుదరదు కదూ. మరి బాబా వారిలో ఉన్న ఆ ప్రత్యేకత ఏమిటి. అది తెలియాలంటే పూర్ణ భగవత్తత్వం యొక్క వివరం తెలియాలి.

భగవంతుడు ఎప్పుడూ నిరతిశయ, నిత్యానంద స్వస్వరూపుడే. మాయకు ఆవల ఉన్నవాడు. కాలా తీతుడు. త్రిగుణాతీతుడు. అటువంటి "భగవంతుడినే స్మరిస్తూ, మన అన్ని కార్యకలాపములను ఆయనకే అర్పితం చేసి, ఆయనను ఆశ్రయం పొంది, ఆయనే మన పరమ లక్ష్యముగా చేసుకుంటే, ఆ తదుపరి ఆయన కృప ద్వారా మనము అన్ని క్లేశములను, అవరోధాలను అధిగమించగలము" అని గీత మనకి బోధిస్తోంది.

బాబా గారు ఇచ్చిన భరోసా కూడా అదే కదూ. అందువల్ల మనం దురభిమానంతో, ఇష్టంవచ్చినట్టు ప్రవర్తించ కుండా, అహం భావనను త్యజించి, చేసే ప్రతీ పనీ ఆయనకే అర్పిస్తూ సాగిననాడు అన్ని కష్టాల్ని అధిగమించగలము.

కర్మ స్తూత్రాన్ని తెలియచేస్తూ అప్పుడు శ్రీ కృష్ణుడు చెప్పినదే ఇప్పుడు బాబా వారి నడతలో ఎలా చూపారో చూద్దాం.

యజ్ఞదానతపఃకర్మ

న త్యాజ్యం కార్యమేవ తత్ ।

యజ్ఞో దానం తపశ్చైవ

పావనాని మనీషిణామ్ ||

గీత 18 - 5 ||

యజ్ఞము, దానము మరియు తపస్సుల సంబంధిత కర్మలను ఎప్పుడూ త్యజించరాదు; అవి తప్పకుండా చేయబడాలి. నిజానికి యజ్ఞము, దానము మరియు తపస్సు అనేవి బుద్ధిమంతులను కూడా పవిత్రం చేస్తాయి.

కర్మలను చేయడం ఎప్పుడూ మానరాదు. అదే సూత్రం మనం మన బాబా గారి ప్రతీ సన్నివేశం లో చూస్తాము. ఆయన సేద తీరుతున్నారనో, లేదా నిద్రిస్తున్నారనో అనుకుంటే అది కేవల భ్రమే.  చిదానంద ఘన పరమాత్మ స్వరూపుడికి ఏ కార్యం దుర్లభం కాదు. అలా అని అది ఆయనే చేయాలని లేదు. వారి కర్మలు మన లాగా ఎవరి ప్రేరణ తోనే చేయబడవు. వారి సంకల్పం,  ప్రకారమే జరపబడతాయి.

యజ్ఞము, దానము, మరియు తపస్సు అనేవి మన ఆధ్యాత్మిక ఉన్నతికి ప్రధమ సోపానాలు అని గుర్తెరిగి మనం జీవన యాత్ర సాగించాలి.  మాయ లో కూరుకున్న మనకు కర్మలు ఎలా జరప బడాలో చెప్తున్న శ్లోకాల్ని చూద్దాం.

ఏతాన్యపి తు కర్మాణి

సంగం త్యక్త్వా ఫలాని చ |

కర్తవ్యానీతి మే పార్థ

నిశ్చితం మతముత్తమమ్ ||

గీత 18-6 ||

ఫలములపై మమకారాసక్తి లేకుండా మరియు ప్రతిఫలాపేక్ష లేకుండా ఈ కార్యములు చేయబడాలి. ఇదే నా ఖచ్చితమైన మరియు సర్వోత్కృష్ట తీర్పు, ఓ అర్జునా.

ఇందులో కర్మ చేయడం ఎంత ముఖ్యమో చెప్తూ, ఎలా చేయాలి అన్నది కూడా చెప్పారు మన కృష్ణయ్య. ఈ శ్లోకం ప్రతి ఫలం ఆశించకుండా పని చేయమని బోధిస్తోంది. అంటే నిష్కామ కర్మ. అదెప్పుడు సాధ్యం అంటే ఉన్నదాంతో తృప్తి పడి, గురు బోధతో నిత్య-అనిత్య వస్తు భేదం ఎరిగి, అన్ని పరిస్థితులు, మనుషులు పట్ల సమదృష్టి కలిగి, ద్వంద్వాతీత స్థితికి చేరినప్పుడే సంభవం. ఇన్ని సాధిస్తే గాని ఈ శ్లోకం చెప్పిన ప్రతిఫలాపేక్ష లేకుండా పని చేసే స్థితికి చేరడం అనేది సాధ్యం కాదు.

ఇన్ని సూత్రాలను, విధి విధానాలను, నియమాలను మాటల్లో కాక, తిన్నగా ముక్తి ని మనకు తెలీకుండానే సాధించే దిశగా బాబా వారు "శాశ్వతమైన నా బోధను, రీతిని అనుసరించి, శ్రద్ధ సబూరి తో పనులు నెరిపిన నాడు, అహంకారం వదలి శరణు అన్ననాడు, అనంతమైన ఆనందాన్ని, తృప్తిని ఇస్తాను" అన్నారు.

భగవంతుడి ఇచ్చే ఆ మాట, ఆ తృప్తి మనలో ఒక నమ్మకం కలిగించి, దేనికీ పెంపర్లాడే అవసరం లేని స్థితికి తీసుకువెళ్ళి, మనతో ప్రతిఫలాపేక్ష లేకుండా పని చేయిస్తుందని వేరే చెప్పనవసరం లేదు కదూ.

సరే. ఇది బానే ఉంది. కానీ ఆ స్థితి కి చేరేలోపు మేము కర్మలు ఎలా నిర్వర్తించాలి అంటే దానికి ముందు మనం ఏమి తెలుసుకోవాలని గీత రెండు శ్లోకాలలో బోధించిందో, దానినే బాబా వారు మూడు పదాల్లో ఎలా చెప్పారో చూద్దాం.

పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।
సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ।।
గీత 18-13 ।।

ఓ అర్జునా, ఏ కార్యము చేయబడాలన్నా వాటి వెనుక ఉన్న ఐదు కారకముల గురించి సాంఖ్య శాస్త్రము ప్రకారం ఏమి చెప్పారో ఇప్పుడు చెప్తాను వినుము, అది కర్మ ప్రతిచర్యలను

ఎలా నిరోధించాలో వివరిస్తుంది.

ఇది ఎందుకు తెలుసుకోవాలి అంటే పైన మనం ప్రతిఫలాన్నో ఆశించకుండా, అంతా భగవదర్పితం చేస్తూ పని చేయాలని తెలుసుకున్నాం. అయితే అది మరింత ధృఢపడాలి అంటే అసలు పనులు చేయాడానికి, దాని ఫలానికి  హేతువులు ఏమిటి అన్నది తెలుసుకోవాలి, అవి ఏమిటో ముందు గీతలో చెప్పింది చూసి, దానికి బాబా వారు చెప్పిన విరుగుడు చూద్దాం.

అధిష్ఠానం తథా కర్తా
కరణం చ పృథగ్విధమ్ ।
వివిధాశ్చ పృథక్ చేష్టా
దైవం చైవాత్ర పంచమమ్ ।। గీత 18 - 14 ।।

శరీరము, కర్త, వివిధ ఇంద్రియములు, వివిధ రకాల కృషి, దైవానుగ్రహము - ఇవే కర్మ యొక్క ఐదు అంగములు.

ఒక్కోటి చూద్దాం. (1) శరీరాన్ని యెంత శుద్ధిగా, ఆరోగ్యంగా ఉంచుకుని పనిని చేస్తామో, ఫలితం అంతే ధృఢం గా ఉంటుంది. (2) చేసేవాడి మానసిక, స్థితి ఆ పనిపై, ఫలితం పై ప్రభావాన్ని చూపుతుంది. (ఇది అంగడి లో ఎవరో చేసినవి తిన్నదానికి, ఇంట్లో అమ్మ చేసే భోజన సేవనకి ఉన్న ఆంతర్యం లో అర్థం అవుతుంది).  (3) ఇంద్రియాలు మనస్సు ఆధీనంలో కాక, బుద్ది ఆధీనంలో ఉండి; ముందు సుఖాన్ని, తరువాత దుఃఖాన్ని ఇచ్చే ప్రేయో మార్గం కాక, ముందు కష్టంగా ఉన్నా శాశ్వత సుఖాన్ని ఇచ్చే శ్రేయో మార్గాన్ని ఎన్నుకునే బుద్ది అధీనంలో ఉండి పనులు చేస్తే వచ్చే లాభం గొప్పగా ఉంటుంది. (4)  ఒక పని జరుగుతున్నప్పుడు మన కృషి, మన దృష్టికోణం, దానిపై మనం ఉంచే గౌరవం, మనం వాడే మన కౌశలత్వం (స్కిల్ల్స్) దాని ఫలితాన్ని ప్రభావం చేస్తుంది. ప్రతి పనిని దైవ సంకల్పం గ చేసిన నాడు మనం దాని సాధనకు మనకు తెలిసినంతలో బాగా

చేయగల్గుతాము.  (5) చివరిది, అతి ముఖ్యం అయినది దైవానుగ్రహం. అది ఉంటే ముందు నాలుగు మన చేతిలో ఉన్నట్లే.

ఇక్కడ మనం ఒక సూక్ష్మం తెలుసుకోవాలి. భగవంతుడు మనందరి శరీరాలలో అంతర్యామిగా ఉన్నాడు. మన పూర్వ జన్మ సంస్కారాలు, వాసనలు, సంచితం ని అనుసరించి, మనం మనగలగడానికి తగిన 1. ఆరోగ్యం  2. మానసిక పరిపక్వత  3. బుద్ధి కుశలత  4. సామర్థ్యం   5. సద్గురువు-సద్గ్రంథం-సత్సంగం అనే వాట్లతో మనకు సంధానం కల్పిస్తాడు. ఇదే దైవానుగ్రహం.

శ్లోకం లో చెప్పిన అయిదు అంగాలకు ఆయన తనవంతు మనల్ని సిద్ధ పరిచడమే కాక, మనలో అంతర్యామి గా ఉంటూ మన ప్రతి పనులను చూస్తున్నాడు. అయితే మనం పని చేసేటప్పుడు ఆయ కేవల సాక్షీభూతంగా ఉంటూ, ఎంత వరకు  మనం ఆయన ఇచ్చిన ఈ అయిదు పనిముట్లను వాడుకుంటున్నామో చూస్తూ ఉంటాడు. ఆయన మన కర్మలను చేయడం, చేయకపోవడం అన్నదానిలో అంతర్భాగం గా ఉండడు. అది పూర్తిగా మన నిర్ణయానికే వదిలేస్తాడు.

అయితే బాబావారు అంతర్యామినే విస్మరిస్తున్న మన అజ్ఞానాన్నించి మనలని ఉద్ధరించ దానికి, దైవ సంకల్పం యొక్క అవసరం తెలియ చేయడానికి, మనం ఏపని చేస్తున్నా సర్వం భగవంతుడి చేతుల్లో ఉంది అన్నది గుర్తు చేస్తూ .. ఎప్పుడూ, ఏ పరిష్టితులలోనూ కూడా అల్లాహ్ మాలిక్ అంటూ మన మనస్సులను భగవంతుడి వైపు ఉంచమని (ఇంద్రియ నిగ్రహం, కర్మ రాహిత్యం, నిష్కామం, కర్మ ఫల సన్యాసం, అహంకార త్యాగం, వైరాగ్యం, మమకారం త్యజించడం ఇత్యాది సద్గుణాలను పెంపొందించుకునే మార్గాన్ని) అనుసరించమని మనకు బోధించారు.

బాబా వారి బోధలోని మరింత ఆంతర్యాన్ని తెలుసుకుందాం.

“నా కథలు వింటే సకల రోగములు నివారింప బడతాయి. కాబట్టి భక్తిశ్రద్ధలతో నా కథలను

వినండి. వాటిని మనస్సులో నిలుపుకోండి. ఆనందమునకు తృప్తికి ఇదే మార్గము. నా భక్తులయొక్క గర్వ అహంకారాలు నిష్క్రమిస్తాయి. నా లీలలు వినేవారికి శాంతి కలుగుతుంది. మనః పూర్వకంగా నమ్మకము ఉన్నవారికి శుద్ధ చైతన్యముతో తాదాత్యము కలుగుతుంది” అంటారు బాబా వారు.

ఇదే భావాన్ని సంతరించుకున్న గీత 3వ అధ్యాయం లో ని శ్లోకం చూద్దాం.

యే మే మతమిదం నిత్యం

అనుతిష్ఠంతి మానవాః I

శ్రద్ధావంతోఽనసూయంతో

ముచ్యంతే తేఽపి కర్మభిః II గీత - 31 II

పూర్తి శ్రద్ధ, విశ్వాసంతో, దోష విచారణ లేకుండా, నా ఈ బోధను పాటించే వారు కర్మ బంధముల నుండి విముక్తులవుతారు.

ఎప్పుడైతే మనం గీత లేక బాబా వారు చేసిన ఉపదేశాలను విశ్వాసం తో స్వీకరించి, ఆచరిస్తామో మన మానసిక రోగాలు (కామం, క్రోధం, లోభం, ఈర్ష, మాయ మొదలైనవి) ఉపశమిస్తాయి. ఎప్పుడైతే మానసిక స్వస్థత చేకూరుతుందో కారణ శరీరం కూడా ఆరోగ్యం గా ఉండి, బుద్ధి స్థిరం గా ఉండేలా చూస్తుంది.

అయితే ఈనాటికి ఎలా అయితే కొంతమంది బాబా వారి పరిపూర్ణత్వాన్ని ఒప్పుకోరో, దానికి కారణం ఏమిటి అన్నది గీతాచార్యుడు నుడివినది చూద్దాం.

త్రిభిర్గుణమయైర్భావైరేభిః

సర్వమిదం జగత్ I

మోహితం నాభిజానాతి

మామేభ్యః పరమవ్యయమ్ II గీత 7 - 13 II

మాయ యొక్క త్రిగుణములచే భ్రమకు లోనై (మోహితులై), ఈ లోకంలోని జనులు, అనశ్వరమైన మరియు సనాతనమైన నా గురించి తెలుసుకోలేకున్నారు.

మాయ మరియు యోగమాయ అనేవి భగవంతుని అధీనం లో ఉంటాయి అని చెప్పుకున్నాం కదా. ఇందులో మాయ భగవత్ ప్రాప్తికి అర్హత సాధించని జీవాత్మ ల నుండి, పరమేశ్వరుని నిజమైన స్వభావాన్ని కప్పివేసి, భగవంతుడికి దూరంగా ఉంచడమే ధ్యేయంగా ఉంటే; యోగమాయ స్వామి వారి కృపాదృష్టి ఎవరిపైనా పడుతుందో వారికి భగవత్సాక్షాత్కారం కలుగేలా చేస్తుంది.

మాయ యొక్క ప్రభావం వల్ల మనిషి మూడు రకాల భౌతిక బాధలకు గురౌతూ ఎన్నో రకాల దుఃఖాలను ఎదుర్కొంటాడు.  వాటినే తాపత్రయం లేదా త్రివిధ తాపాలు అని కూడా అంటాము. అవి 1. ఆధ్యాత్మిక తాపం, 2. అధిభౌతిక తాపం, 3. అధిదైవిక తాపం.

ఆత్మ అనే దానికి శరీరం, మనస్సు, బుద్ధి , జీవాత్మ , పరమాత్మ అని వివిధ అర్థాలున్నాయి. మనస్సు, శరీరం ఇత్యాదుల కారణంగా కలిగే శోకం, మోహం, జ్వరాది రోగాలు మున్నగు బాధలు

ఆధ్యాత్మిక తాపాలు -భూతము లనగా ప్రాణులు. మనుష్యులు, పశువులు, పక్షులు, పాములు మొదలైన ప్రాణుల ద్వారా సంభవించే బాధలు

అధిభౌతిక తాపాలు.
యక్షరాక్షసుల చేత, గ్రహావేశాల చేత, దైవబలముతో కలిగేవి

అధిదైవిక తాపాలు. భూకంపం, సునామీ, అతివృష్టి, అనావృష్టి మొదలైనవి.

మానవులమైన మనకు కలిగే నానావిధాలైన బాధలు ఈ త్రివిధ తాపాలలో చేరిపోతాయి. వీటికి గురైనవారు "తాపత్రయ పీడితులు" అనబడతారు.  మాయ యొక్క ప్రభావం వలన

సాక్షాత్తు భగవంతుడే వారి ముందున్న గుర్తించ లేక పోతారు.  మరి అటువంటి మాయా బంధనాన్ని తెంచుకుని బయట పడడం ఎలా అన్నది తెలియాలి అంటే గీత ఏం చెప్తోందో చూద్దాం.

దైవీ హ్యేషా గుణమయీ
మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంతే
మాయామేతాం తరంతి తే ॥
గీత 7-14 ॥

ప్రకృతి త్రిగుణాత్మకమైన నా దైవీ శక్తి 'మాయ'  అధిగమించ డానికి చాలా కష్టతరమైనది. కానీ, నాకు శరణాగతి చేసిన వారు దానిని సునాయాసముగా దాటిపోగలరు.

ఈ శ్లోకం లో శ్రీక్రుష్ణులు వారు చెప్పిన దానికి బట్టి మాయ అనేది అధిగమించటానికి చాలా కష్టమైనది. ఎవరైనా మాయను వశపరుచుకుంటే దాని అర్థం ఆ వ్యక్తి భగవంతుడిని జయించినట్టే. ఎవ్వరూ కూడా భగవంతుడిని జయించలేరు కాబట్టి ఎవ్వరూ కూడా మాయని కూడా జయించలేరు. మరియు, మనస్సు అనేది మాయతో తయారయినదే కాబట్టి, ఏ యోగి, జ్ఞాని లేదా కర్మీ కూడా కేవలం స్వీయశక్తి చే మనస్సుని విజయవంతంగా నియత్రించలేరు. అనువల్ల సాక్షాత్తు స్వామి వారే ఈ శ్లోకం లో రెండో పాదం లో విరుగుడు సూచిస్తున్నారు.

"పరమేశ్వరుడినైన నాకు, నీవు శరణాగతి చేస్తే, అప్పుడు నా కృప చే, నేను నిన్ను ఈ భౌతిక జగత్తు అనే సాగరాన్ని దాటింపచేస్తాను. ఈ జీవాత్మ నాదై పోయింది (నన్ను ఆశ్రయం పొందింది) అని మాయ కు చెప్తాను. దయచేసి దీన్ని విడిచిపెట్టు అని".

న మాం దుష్కృతినో మూఢాః

ప్రపద్యంతే నరాధమాః ।

మాయయాపహృతజ్ఞానా

ఆసురం భావమాశ్రితాః ।।

గీత 7-15 ।।

నాలుగు రకాల మనుష్యులు నాకు శరణాగతి చేయరు - జ్ఞానము లేని వారు, నన్ను తెలుసుకునే సామర్థ్యం ఉన్నా సోమరితనం తో తమ నిమ్న స్థాయి స్వభావాన్ని అనుసరించేవారు, బుద్ధి భ్రమకు గురైనవారు, ఆసురీ ప్రవృత్తి కలవారు. అలా తెలుసుకోలేక పోవడానికి కారణం ఏమిటో ఇలా చెప్తున్నారు.

ఇచ్ఛాద్వేషసముత్థేన

ద్వందమోహేన భారత ।

సర్వభూతాని సమ్మోహం

సర్గే యాంతి పరంతప ।।

గీత 7 -27 ।।

ఓ భరత వంశస్తుడా - రాగ, ద్వేషములనే ద్వందములు, మోహము (భ్రాంతి) నుండే పుట్టుచున్నవి. ఓ శత్రువులను జయించేవాడా, ఈ భౌతిక జగత్తులో ఉన్న ప్రతి ప్రాణి కూడా పుట్టుక నుండే వీటిచే భ్రమింపజేయ బడుచున్నది. వీట్లన్నిటినీ అధిగమించి మరి స్వామి భక్తీ లో కి ఎలా వస్తామో ఈ క్రింది శ్లోకం చెప్తోంది.

యేషాం త్వంతగతం పాపం

జనానాం పుణ్యకర్మణామ్ ।

తే ద్వంద్వమోహనిర్ముక్తా

భజంతే మాం దృఢవ్రతాః ।।

గీత 7 -28 ।।

పుణ్య కార్యములు ఆచరించుటచే ఎవరి పాపములు అయితే పూర్తిగా నశించిపోయినవో, వారు ఈ ద్వంద్వముల మోహము నుండి విముక్తి పొందుతారు. అటువంటి వారు నన్ను ధృఢ సంకల్పము తో పూజిస్తారు.

ఇంతలా ఎందుకు చెప్పాల్సి వచ్చింది అంటే సాయి భక్తీ మార్గం లో పడడం అన్నది కాకతాళీయంగా జరిగేది కాదు. ఎన్నో జన్మలలో ఈ జీవి చేసిన అభ్యాసం, పూర్వ వాసనలు ఇత్యాదుల ఫలమే ఈ సాయి భక్తీ. అంత అలా శ్రమ పడి వచ్చాము కాబట్టే మనం అడిగింది కాకుండా, మనకి ఏది మేలు చేస్తుందో దాన్నే ఆయన మనకి వొసగి, మనల్ని ఈ భవరోగం నించి కాపాడతారు. ఇంకొంచెం లోతుగా తెలుసుకుందాము.

"భక్తిశ్రద్ధలతో నా కథలను వినండి. వాటిని మనస్సులో నిలుపుకోండి. ఆనందమునకు తృప్తికి ఇదే మార్గము. నా భక్తులయొక్క గర్వ అహంకారాలు నిష్క్రమిస్తాయి. నా లీలలు వినేవారికి శాంతి కలుగుతుంది. మనః పూర్వకంగా నమ్మకము ఉన్నవారికి శుద్ధ చైతన్యముతో తాదాత్యము కలుగుతుంది" – షిర్డీ బాబా.

తన కధలను భక్తీ శ్రద్ధలతో వినడమే ఆనందానికి, తృప్తి కి మార్గం అని బాబా వారు చాలా సరళ పదాలలో - ఒక విధంగా సమ బుద్ధితో ఉండగలిగే - మార్గాన్ని సూచించారు. చాలా సరళంగా ఉన్న ఈ పదాలలో ఉన్న గొప్ప దైవీ భావం ఏంటో చూద్దాం.

మనకు తెలిసిన, మనం చదివిన, మనం చూసిన, మనం విన్న ఎందరో గొప్ప వాళ్ళు ఉండవచ్చు. వారిలో ఎవరైనా నిజంగా తృప్తిగా ఉన్నారు అని ఘంటాపదంగా చెప్పగలమా. లేదు. అసలు తృప్తి, ఆనందం అంటే ఏమిటో తెలిస్తేనే కదా అది పొందే ప్రయత్నం చేసేది.

జితాత్మనః ప్రశాంతస్య
పరమాత్మా సమాహితః ।

శీతోష్ణసుఖదుఃఖేషు

తథా మానాపమానయోః ||

గీత 6 - 7 ||

మనస్సుని జయించిన యోగులు - శీతోష్ణములు, సుఖదుఃఖములు, మానాపమానములు - ఈ ద్వందములకు అతీతంగా ఉన్నతమైన స్థానంలో ఉంటారు. ఇటువంటి యోగులు ప్రశాంతతతో, భగవత్ భక్తి యందు స్థిర చిత్తముతో ఉంటారు.

పై శ్లోకం మనకు నిజమైన సుఖం ఏమిటో సూచిస్తోంది. దానికి కావాల్సిన ముఖ్యమైన సాధన మనస్సును నియంత్రించడం. మనస్సును నియంత్రించడం అంత తేలికైనది కాదు అని సాక్షాత్తు శ్రీకృష్ణుల వారు, అలాగే తన భక్తులకు బాబా గారు కూడా చెప్పారు.

తం విద్యాద్ దుఃఖసంయోగ

వియోగం యోగసంజ్ఞితమ్ |

స నిశ్చయేన యోక్తవ్యో

యోగోఽనిర్విణ్ణచేతసా ||

గీత 6 - 23 ||

దుఃఖముల నుండి విముక్తి పొందిన స్థితినే యోగమని అందురు. ఈ యోగమును ధృఢ సంకల్పముతో ఎలాంటి నిరాశావాదం/అపనమ్మకం లేకుండా అభ్యాసం చేయవలెను;

ఈ రెండు శ్లోకాల ద్వారా మనకి తెలుస్తోంది ఏమిటంటే కోరికలను త్యజించాలి. అప్పుడే మనకు బాధలనించి ఉపశమనం కలిగి, మనస్సు ప్రశాంత స్థితిని పొందగలుగు తుంది.

అందుకే విజ్ఞులు "న హ్యసన్న్యస్త సంకల్పో యోగీభవతి కశ్చన" అంటారు. జ్ఞానామృతముచేత తృప్తుడు, కృత కృత్యుడును అయిన యోగికి కర్తవ్యము ఏది ఉండదు. ఉంటే అతడు తత్త్వజ్ఞుడు కాడు" అంటారు.

కోరికలు వదలాలి అంటే వాటికి మూలమైన సంకల్ప త్యాగం చెయ్యాలి. అసలు ఏదో కావాలి అన్న భావనే మన మనస్సులోకి రాకూడదు. ఆ స్థితి ఎలా పొందాలి అన్నది గీత పదాల్లో చూసి, దానినే మన బాబా వారు మనకి ఎంత సూక్ష్మంగా బోధించారో చూద్దాం.

యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరం ।
తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్ ||గీత 6 - 26 ||

ఎప్పుడెప్పుడైతే, ఎక్కడెక్కడికైతే ఈ చంచలమైన నిలకడ లేని మనస్సు పరిభ్రమిస్తుందో దానిని తిరిగి తెచ్చి నిరంతరం భగవంతుని మీదనే కేంద్రీకరించాలి.

ఇది ఎవరికైన కష్టమే. అయితే అభ్యాసం ద్వారా అలా తిరుగున్న మనసుని భగవంతునిపై కేంద్రీక రించేలా చేయాలి. దానికి ఉన్న అతి సుళువైన మార్గం భగవన్నామ స్మరణం. దానినే "అల్లాహ్ మాలిక్" అన్న నిరంతర మననం లో బాగా మనకు చేసి చూపారు. ఆ స్థానంలో మన ఇష్ట సనాతన దైవాన్నో (రామ, కృష్ణ, శివ) లేదా గురు మంత్రాన్నో, లేదా మరో ధ్యాన పద్ధతినో ఆశ్రయించి ఈ మనస్సుని ఒకే వైపు కేంద్రీకృతం అయ్యేలా చేయాలి.

అలా కుదుట పడ్డ మనసుకు, బాబా కథలనో, దత్త అవతారాల ప్రాభవాన్నో, ఏకాదశ సూత్రలనో, శ్రద్ధ - సబూరి ల విభావాన్నో, జ్ఞానేశ్వరినో, ఏక నాథ భాగవతాన్నో పరిచయం చేసిన నాడు, ఆ పవిత్ర అవతారాలలోని మాహత్మ్యానికి మనస్సు తల వొగ్గి, మాయ ప్రభావము నించి కొంత నిలదొక్కుకుని, ఆత్మోన్నతికి పుదాది వేసుకుంటుంది.

అయితే దీనికి కూడా కొన్ని టర్మ్స్ & కండిషన్స్ ఉన్నాయి. వాటికి మనం వొప్పుకుని తీరితేనే గాని మన మొర వైకుంఠపుర విభుడికో, ద్వారకా ప్రభుడికో చేరదు. అదే అనన్య శరణాగతి. అది ఏ దేవుడి దగ్గరకి వెళ్తే ఆ దేవుడినే “తుమీహో మాతా.. పితా తుమీహో” అంటూ చప్పట్లు కొట్టేస్తూ, మనస్సులో మాత్రం ఆ భావం నిలుపుకో కుండా పాడడం అంత సులభం కాదు. ఇక్కడ అహంకార త్యాగం, సంకల్ప త్యాగం అనేవి ముఖ్యంగా కావాలి.

అహం భావన  ఉన్నంత సేపు తత్- త్వం – అసి (ఎక్కడో ఉన్నాడు అనుకున్న దేవుడు నీలోనే ఉన్నాడు) అన్న నిజం నీకు దూరమై, ఆ అహం అన్న రాకాశి తోనే సుఖిస్తూ నీరసపడుతూ ఉంటావు. అహం వదిలిన నాడు, సర్వం బాబా కే సమర్పించినాడు, అనన్య శరణాగతి కోరిన నాడు, మన అన్ని భారాలు మన కర్మానుసారం తీర్చి, మనము  స్వామి భక్తిలో లీనమై మరింత మానసిక స్థైర్యం కూడబెట్టుకునే పరిస్థితి కల్పించి, మనకు నిత్యానందాన్ని కరతలామలకం చేస్తారు.

అలా ఒసగాబడే ఆనందం యొక్క పేరే తృప్తి, శాశ్వతానందం. మరొక్క సారి మన సాయి సూచించిన భవరోగ హరణ పదాల్ని చూసి, వాటికి – పైన ఉదాహరించిన శ్లోకాలలో ఉన్న శ్రీకృష్ణ బోధకీ తేడ ఏమన్నా ఉన్నదా అది పరికించి చూసి ముగిద్దామా.

“భక్తిశ్రద్ధలతో నా కథలను వినండి. వాటిని మనస్సులో నిలుపుకోండి. ఆనందమునకు తృప్తికి ఇదే మార్గము. నా భక్తులయొక్క గర్వ అహంకారాలు నిష్క్రమిస్తాయి. నా లీలలు వినేవారికి శాంతి కలుగుతుంది”.

“నా లీలలు వినేవారికి శాంతి కలుగుతుంది. మనః పూర్వకంగా నమ్మకము ఉన్నవారికి శుద్ధ చైతన్యముతో తాదాత్యము కలుగుతుంది. 'సాయి సాయి' అను నామాన్ని జ్ఞాపకము ఉంచుకున్నంత మాత్రాన, చెడు పలుకడం వలన, వినటం వల్ల కలిగే పాపాలు తొలగిపోతాయి” - బాబా.

మానవుడు శ్రమించో, పూర్వ జన్మ సుక్రుతం వలనో, నడిమంత్రపు సిరి వలనో ఐశ్వర్య వంతుడు కావచ్చు. ధనార్జన చేయచ్చు. గొప్ప పదవులు పొందవచ్చు. ఇవన్నీ ఉన్నా శాంతి లేక, ఏదో ఒక బాధతో కొట్టు మిట్టాడే జీవులు మన చుట్టూ ఎందరో. మరోవైపు గొప్ప సంపదగా మనం భ్రమించేవి లేకుండానే, ఆనందంగా, ఎప్పుడూ నవ్వుతూ, అందరితోనూ ఆప్యాయంగా మెలిగే శాంతి జీవులూ ఎందరినో మనం చూస్తూనే ఉంటాము.

శాంతి పొందడం అనేది ఎంత ముఖ్యమో అయిదు పదులు దాటిన వారికి చెప్పాల్సిన అవసరం లేదు. అదేదో పనికిరాని వస్తువుగా భావించి, దానిని పట్టించుకోకుండా, ధనమేరా అన్నిటికీ మూలం అంటూ పరుగుపెట్టే అయిదు పదుల క్రింది వారికి ఈ క్షణం లో అర్ధం కాపోయినా, శాంతి అన్న పదం యొక్క విలువ అర్ధం అయ్యే రోజు ఎలాగూ వస్తుంది.

అంత గొప్ప శాంతిని ఇస్తాను అంటున్నారు మనం బాబా. అది ఇస్తాను అన్న సనాతన భగవానుడు ఎవరేనా ఉన్నారు అది కృష్ణయ్యే. ఆయన మాటలలో చూద్దాం.

భోక్తారం యజ్ఞతపసాం
సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం
జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి
|| గీత 5-29 ||

సమస్త యజ్ఞములకు, తపస్సులకు భోక్తని నేనే అని, సమస్త లోకములకు అధిపతిని అని మరియు సర్వ ప్రాణుల యొక్క నిస్వార్థ మిత్రుడను అని తెలుసుకొనిన పిదప, నా భక్తుడు శాంతిని పొందును.

సూక్ష్మంగా చెప్పాలి అంటే వడ్డించే వాడు మన వాడైనప్పుడు ఎక్కడ కూర్చుంటే ఏమిటి అన్న భరోసా. లోకానికే శాంతి ఇచ్చే వాడు ఆ జగద్గురువు. అలాగే మన లాంటి అవిద్యా బాధితులకు శాంతినిస్తానని ఘంటాపదంగా చెప్పిన వాడు ఈ సద్గురువు. ఇంకా దేనికో అర్రులు చాస్తూ, ఏదో కావాలని భ్రమలో తిరగడం అంటే మరింత అవిద్య, అజ్ఞానం, అంధకారంలో కూరుకుని పోవడమే.

మన బాబా 'సుహృదం సర్వ భూతానాం' అంటే 'సమస్త ప్రాణులకు మంచి చేసే శ్రేయోభిలాషి'. సాయి చరిత్రలోని ఏ ఉదంతం లోనూ ఆయన ఏ జీవియొక్క ఆహితాన్ని ఆశించలేదు. భగవత్ నిర్దేశానుసారం.. తనను కోరిన భక్తుల కోరికలు ఏవైనా తీర్చలేక

పోయిన క్షణం లో (దైవ నిర్ణయం ప్రకారం) కూడా ఒక సాధారణ మానవుడిగా వాళ్ళు అడిగినప్పుడు (అది జరగదు అని) కన్నీటితో సూచించారు గాని ఎక్కడా ఇది దైవనిర్ణయం అని వారిని బాధించే విధంగా చెప్పలేదు. అది ఆయన సమస్త ప్రాణుల శ్రేయస్సును కోరే నైజాన్ని చెప్తోంది.

దీనికి కారణం చూడాలంటే ఆ దివ్య మూర్తుల మోక్ష ప్రదాత తత్త్వం. అనాది నుండి జీవాత్మ, భగవంతుని నుండి విడిపోయి ఉంది. అలా విడిపడి కొట్టుకుంటూ ఉన్న జీవాత్మ ను పరమాత్మ తో ఏకం చేసేదే మోక్షం. అటువంటి మోక్షాన్నే కరతలామలకం చేసే సూత్రాలను, అతి సాధారణ నడవడికలో సూచించి, వారికి తెలీకుండానే ఏకాదశ సూత్రాలను పాటించే భక్తులను మోక్షగాములను చేసేస్తుంటే, ఇక అశాంతికి తావేది చెప్పండి. అందుకే అప్పుడు శ్రీకృష్ణుడు ఇచ్చిన భరోసానే, ఈరోజు మన సాయి రాముడు ఇస్తున్నాడు.

అలాగే శుద్ధ చైతన్యం తో తాదాత్మ్యం కలగడం అంటే. బాబా చరిత్రను ఒక కధగా చదువుకుంటూ పోతే ఈ మాట (శుద్ధ చైతన్యం తో తాదాత్మ్యం) పైన మనం పెద్ద దృష్టి పెట్టం. ఎందుకంటే చైతన్యం, దాన్లోనే శుద్ధ చైతన్యం అనేవి మన ఉనికిని తెలియచేసే పదాలే అయినా, వాటిలో ఎంతలా మనం సహజీవనం చేస్తున్నాం అంటే మనం వాటి ఉనికినే పట్టించుకోం. అవునండి! విషయానికి వద్దాం.

వేదానాం సామవేదోఽస్మి
దేవానామస్మి వాసవః ।
ఇంద్రియాణాం మనశ్చాస్మి
భూతానామస్మి చేతనా ॥
గీత 10-22 ॥

నేను వేదములలో సామ వేదమును, దేవతలలో ఇంద్రుడను. ఇంద్రియములలో మనస్సును; ప్రాణులలో చైతన్యమును.

ఋగ్-యజు-సామ-అథర్వ వేదాలలో సామ వేదం సంగీత ప్రధానంగా భగవత్ స్తుతికి విశిష్ఠతను ఆపాదిస్తూ, భక్తిని పెంపొందిస్తుంది. అలాగే కీర్తి, హోదా అనేవాట్లకు ఇంద్రుడే కొలమానం. ఇక మనస్సు ఇంద్రియాలకు రారాజు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే చైతన్యం అనేది ఒక కలికితురాయి. ఒక ప్రాణం లేని శరీరానికి ఎన్ని సొబగులు, ఆభరణాలు, సుగంధ ద్రవ్యాలు అలంకరించినా అది ఎబ్బెట్టు గానే ఉంటుంది. అదే ప్రాణం ఉన్న ఒక శుద్ధ రూపానికి ఏమీ లేకపోయినా అది భాసిస్తుంది. అలా ఎందుకు అంటే దానిలో మనకి  వ్యక్తం అయ్యే చైతన్యం వల్ల.

మనలో ఎందరో రోజు చేసే గాయత్రిలో కూడా మనం మన బుద్ధిని ప్రేరేపించి మనల్ని సరైన దిశలో పెట్టమని కోరుకునేది ఆ చైతన్య స్వరూపిణిసే. ఆ చైతన్యమే తాను అన్నారు గీతలో శ్రీక్రుష్ణులవారు. సాక్షాత్తు తానే చైతన్యం కాబట్టే చైతన్య ప్రదాయని కూడా ఆయనే. అంటే ఆ కృష్ణుడే .. ఆ బాబానే.

ఆ చైతన్యం కూడా మాయకు, అజ్ఞానానికి, అంధకారానికి లోబడి వర్తించే చైతన్యం కాదు. శుద్ధ చైతన్యం. అంటే అన్ని విధాల మంచినే చేసే చైతన్యం. దివ్యత్వాన్ని చేకూర్చే చైతన్యం. అటువంటి శుద్ధ చైతన్యంతో వారికి యోగాన్ని (అంటే కలయికని) ప్రసాదించి, వారిని తాదాత్మ్య స్థితికి తీసుకుని వెళ్తాను అంటున్నారు.

అసలు మోక్షం, ఆత్మజ్ఞానం, ముక్తి ఇత్యాది మహా వాక్యాలే శ్లాఘించిన పదాలను ఎందరో బోధ గురువులు, మత పెద్దలు, పీఠాధిపతులు ప్రవచనాలలో చెప్పేస్తూ ఉంటారు కానీ.. ఆసలు ఆస్థితి ఎలా ఉంటుందో ఈ బోధించే వారిలో ఎంత మంది చూశారు. ఆ స్థితి ఎంత మందితో అనుభవింప చేశారు.

తీపిఎలా ఉంటుందో తెలుస్తేనే కదా అది కావాలో వద్దో నిర్ణయించేది. అది తెలిసేదాక ఏదో చదివిన దానిని బట్టో, విన్న దానిని బట్టో మాట్లాడేస్తూ ఉంటాము. అలాకాక "ఇది తీపి. ఇలా ఉంటుంది. కావాలా వద్దా  రుచి చూపించి అడిగే గురువులు తారస పడ్డారా.

అటువంటి సద్గురువు మన షిరిడి బాబా అని అనుభవపూర్వకంగా చెప్తున్నాను.

ఎవరిని కలిసినా "జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి పార్వతి" అని కోరే నాకు అసలు ఆ "మోక్షం.. మోక్షం.. అంటూ ఉంటావు కదా. అదెలా ఉంటుందో తెలుసా.. అని .. అదెలా ఉంటుందో చూపి. ఇక నువ్వే తెల్సుకో" అని అనుభవ పూర్వకంగా బోధించిన గురువు మన సాయినాధ భగవానుడు.

దానికి నేను శక్తి పాతం అనో, లేదా మరో నాకే తెలీని పదాన్ని వాడను. అది కేవలం ఆయన కృప. ఆ స్థితి నాకు తెలిసి తాదాత్మ్యం, మోక్షం, ముక్తి, చిద్ఘన శాంతి, చిదానంద స్థితి, చిన్మయ దర్శనము, పరమ శాంత స్థితి, అలౌకిక ఆనందం, దివ్యానుభూతి ఇత్యాది లెక్కలేనన్ని పద కుసుమాలు కూడా తూగలేని ఒక దివ్యానుభూతి.

అలాంటి స్వామి నామ జపమే సర్వపాప నివారిణి అన్నది వివరించాలంటే పదాలు వెతుక్కోవక్కర్లేదు కదూ. "నామస్మరణాత్ అన్యోపాయం నహి పశ్యామో భవతరణే" అన్నారు విజ్ఞులు. ఈ సంసారిక జీవితంలో మానవజన్మ తరించాలంటే నామ స్మరణ చేయాలి. భగవంతుణ్ణి చేరే మార్గంలో నామస్మరణం ఉత్తమం అన్నది నారద భక్తి సూత్రాలు, భాగవతం, తులసి రామాయణం, ఆధ్యాత్మ రామాయణం, నారాయణీయం ఇత్యాది గొప్ప గ్రంధాలు మానవాళికి బోధిస్తున్నాయి.

ప్రకృతిలో సకల జీవాలు సత్వరజస్తమోగుణాలచే నిండి ఉన్నాయి. భగవంతునకు శరణాగతుడైనవాడికి ఈ గుణాల బంధంనుండి విముక్తి లభిస్తుంది. అటువంటి శరణాగతి కలగాలంటే త్రికరణ శుద్ధిగా మనలోని ప్రతీ ఒక్క భాగం భగవద్ విభూతి తో మమైకం కావాలి. అందుకు ఉపకరించేదే నామ స్మరణ.

సతతం కీర్తయంతో మాం

యతంతశ్చ దృఢవ్రతాః ।

నమస్యంతశ్చ మాం భక్త్యా

నిత్యయుక్తా ఉపాసతే ||

గీత 9 - 14 ||

(నా భక్తులు) ఎల్లప్పుడూ నా దివ్య లీలలను గానం చేస్తూ, ధృఢ సంకల్పంతో పరిశ్రమిస్తూ, వినయముతో నా ముందు ప్రణమిల్లుతూ, నిరంతరం వారు నన్ను ప్రేమ యుక్త భక్తి తో ఆరాధిస్తుంటారు.

నవ విధ భక్తి మార్గాలు ఉండగా ఈ నామ స్మరణ అనే దాన్ని బాబా వారు ఎందుకు వక్కాణించారు అంటే మనస్సు అనేది ఎప్పుడూ చంచలంగా ఇంద్రియాలతో పరుగిడుతూ, ఒక దాని తర్వాత ఇంకో విషయం వైపు పోతూనే ఉంటుంది. నామ స్మరణ.. అలాగే కీర్తన అనేవి మన యొక్క జ్ఞానేంద్రియాలను భగవంతుడిపై కేంద్రీకృతం చేయడంలో చాల పని చేస్తాయి. అందుకే శరణాగతి చేసిన తన భక్తులకు వారికి తెలియకుండానే వారికి కావాల్సిన జ్ఞాన బోదని తన చేతల్లో, మాటల్లో, బోధలలో చూపించి, అప్పటి ఆ గీతాచార్యుడే ఈరోజు ఈ నాటి బాబా రూపంలో, సనాతనమైన గీత బోధని తన జన బాహుళ్య పదాల్లో, సర్వులకు సులభ గ్రాహ్యంగా బోధించారు. ముందు ముందు మరిన్ని విషయాలు తెలుసుకుని ఆ జ్ఞాన గంగలో మునకలేద్దాం.

'సాయి సాయి' అను నామాన్ని జ్ఞాపకము ఉంచుకున్నంత మాత్రాన, చెడు పలుకడం వలన, వినటం వల్ల కలిగే పాపాలు తొలగిపోతాయి" – బాబా

"తత్వమసి, "అహం బ్రహ్మాస్మి "" అనగా ఆ తత్వాన్ని నేను, సోహం అంటే కూడా అదే అర్థం, నేనే నీవు, నీవే నేను, నేను నీవై, నీవు నేనై ఉన్నాను, నీకు, నాకు భేదం లేదు, అన్నది చక్కని అద్వైత సిద్ధాంతం.  అలాగే అన్నమయ్య, త్యాగయ్య, పోతన, రామదాసు , తులసీ దాసూ లాంటి ఎందరో భక్తులు, దైవాన్ని గురించి కీర్తనలు రాస్తూ పాడుతూ, ధ్యానిస్తూ భావిస్తూ , "మేము రాముని వారము,! రాముని బంటు లము "రామ దాసుల ము  ,,,!""అంటూ రాముని పట్ల" దాసభక్తి ""నీ ప్రకటించుకొన్నారు,!

అందుకే గీత లో శ్రీకృష్ణుడు ఎవరు నన్ను సదా సంపూర్ణ విశ్వాసంతో సేవిస్తూ ఉంటారో, పూజిస్తూంటారో , ఆ భక్తులు నాలోనే  ఉంటారు అని చెప్పారు.

అదే విషయాన్ని ఇక్కడ  బాబా గారు కూడా చెప్తున్నారు. అటువంటి  పరమాత్మ ను ధ్యానిస్తూ శరణాగతి భావంతో, అత్మ సమర్పణ చేస్తూ , తత్వ చింతన చేస్తూ , తగిన స్పూర్తిని శక్తిని ప్రసాదించమని కోరుకోవడం మన ధ్యేయం కావాలి.

ఆ స్థితిలో ఉన్నప్పుడు నామ జపమే అవసరం లేదు, నామం గుర్తు వస్తే చాలు అన్ని పాపలు తొలగి పోతాయి అంటున్నారు బాబా వారు.  దీన్నే గీత లో చెప్పిన వైనం చూద్దాం.

విషయా వినివర్తంతే

నిరాహారస్య దేహినః ।

రసవర్జం రసోఽప్యస్య

పరం దృష్ట్వా నివర్తతే ॥

గీత 2-59 ॥

సాధకులు ఇంద్రియములను భోగ వస్తు/విషయముల నుండి నియంత్రించినా, ఇంద్రియ విషయముల మీద రుచి ఉండిపోతుంది. కానీ, భగవత్ తత్వాన్ని అర్థం చేసుకున్నప్పుడు ఆ రుచి కూడా అంతమగును.

భగవద్గీత లో కృష్ణుడు గాని, బోధలలో బాబా గాని కోరికలను అణచివేయమని చెప్పలేదు, నిజానికి ఆ కోరికలను భగవంతుని వైపు మరల్చి పునీతం చేసుకోమని బోధించారు. అలా అభ్యాసం చేస్తుంటే దానికి భగవత్ కృప తోడై, అది ఏం సాధింప చేస్తుందో చూడండి.

రాగద్వేషవియుక్తైస్తు

విషయానింద్రియైశ్చరన్ ।

ఆత్మవశ్యైర్విధేయాత్మ ప్రసాదమధిగచ్ఛతి ||

గీత 2 - 64 ||

ఇంద్రియ విషయ/వస్తువులను వాడేటప్పుడు కూడా మనస్సుని నియంత్రించినవాడై, మమకార-ద్వేష రహితంగా ఉన్నవాడు భగవంతుని కృపకు పాత్రుడగును.

బాబావారు కూడా మనకు ఆచరణలో ఎప్పుడూ భగవన్నామాన్ని జపిస్తూ ఉండమని తన నడతలో చూపించి, మన మనస్సునే నియంత్రించమని సూచించారు.

అలా ఆయన మాటని అనుసరించి, ఆచరించిన నాడు చెడు పలుకడం వలన, వినటం వల్ల కలిగే పాపాలు తొలగిపోతాయి అన్నారు కదా. అదెందుకో చూద్దాం.

మాం చ యోఽవ్యభిచారేణ

భక్తియోగేన సేవతే ।

స గుణాస్ సమతీత్యైతాస్

బ్రహ్మభూయాయ కల్పతే || గీత 14 - 26 ||

నిష్కల్మషమైన భక్తి ద్వారా నన్ను సేవించిన వారు ప్రకృతి త్రిగుణములకు అతీతులై పోవుదురు మరియు బ్రహ్మం స్థాయికి చేరుతారు.

బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్

అమృతస్యావ్యయస్య చ ।

శాశ్వతస్య చ ధర్మస్య

సుఖస్యైకాంతికస్య చ ||

గీత 14 - 27 ||

ఆ యొక్క సనాతనమైన, అవ్యయమైన నిరాకార బ్రహ్మంమునకు, సనాతనమైన ధర్మమునకు మరియు అఖండమైన దివ్య ఆనందమునకు, నేనే ఆధారము.

పరమేశ్వరుని సాకార రూపము పట్ల నిశ్చలమైన అనన్య భక్తి తో నిమగ్నమవ్వటమే, త్రిగుణముల యొక్క వ్యాధుల సర్వరోగనివారిణి, అని రూఢీగా చెపున్నాడు.

పై శ్లోకాలలో శ్రీకృష్ణుల వారు వివరించిన దానినే బాబా వారు తన నామ స్మరణతో, తనను మనస్సులో నింపుకుంటే చాలు వారిని తరింప చేస్తాను అని తెలియచేశారు.

గీతే కాక సనాతనం గా చూసినా 'నామస్మరణాత్ అన్యోపాయం నహి పశ్యామో భవతరణే' ... ఈ సంసారిక జీవితంలో మానవజన్మ తరించాలంటే నామ స్మరణ చేయాలి అనే తెలుస్తోంది. నామ మంత్రమో, బీజాక్షర మంత్రమో, గురు మంత్రమో ఏదైనా నమ్మికతో సాధన చేసిన నాడు అది మన సంచితాన్ని దగ్ధం చేసి మనల్ని జీవన్ముక్తుల్ని చేస్తుంది అన్నది నిస్సంశయంగా చెప్పవచ్చు.

ఇక్కడ సాక్షాత్తు అవధూత అయిన బాబా వారు చెప్తున్నారు. అవధూతల యొక్క పరిసరం కూడా అందరి పాపాల్ని భస్మం చేసే శక్తివంతమైనది అంటారు. అటువంటిది సాక్షాత్తు అవధూతలలో అగ్రగణ్యులు, దత్తవతారులు, పూర్ణావతారులు అయిన బాబా వారు చెప్తున్నారంటే అది మన బంధవిముక్తి కే అన్న విషయం గ్రహిచడానికి అడ్డుపడేది మన మాయే అని గ్రహించాలి.

కేవలం నామ స్మరణ తో మరెవరూ పొందలేని స్థాయిని పొందాడు ధ్రువుడు. రామ నామం తోనే సీతమ్మ వారి జాడకై వెడలిన హనుమ సముద్రాన్ని లంఘించాడు. నామ స్మరణ అంటే మరేం లేదు.  వీలున్నతలో ఆయన్ని తలుచుకుంటూ, మనం చేసే ప్రతీ కార్యం, సాధించే ప్రతీ కార్యం ఆయనదే అని ఒప్పేసుకుని ఆయనని కీర్తించడమే, పొగడడమే. అప్పుడు అందులో తప్పొప్పులు (ఆ  మాట కొస్తే అస్సలు తప్పులే జరగవు లెండి) అన్నీ మనకి (కర్తకి) కాక ఆ దైవానికే ఆపాదించబడి, మన కర్మ కూడా అకర్మ గా మారి, బంధంగా మారదు. అది మనం హనుమ లో లంకాదహనం లాంటి మహా కార్యాన్ని కూడా తానే చేసేస్తూ, కర్తృత్వాన్ని మాత్రం “నమోస్తు రామాయ సలక్ష్మణాయ” అంటూ రామ లక్ష్మణ

సీత ఇత్యాదుల కృపకు అంకితం చేయడంలో గమనించవచ్చు.

ఇక్కడ మనం అదే స్ఫురణ కు తెచ్చుకుని బాబా వారి నామం పై పూర్తి శ్రద్ధతో ఉంటూ, త్రికరణ శుద్ధిగా మనం చేసే ప్రతీ పని, మాట, ఆలోచన ఆయనకే అర్పిస్తూ, అటు ఇటు పరిగెడుతున్న మనసుకు వారి నామం అనే ఆలంబన ఇస్తే చాలు. ఇక మనం కార్యాన్ని సాధించినట్లే. మిగిలిన విషయాలు చూద్దాం.

మీరు ఎక్కడ వున్నా, ఏం చేస్తున్నా నాకు తెలుస్తూనే ఉంటుందని జ్ఞాపకం ఉంచుకోండి. నేను అందరి హృదయాలను పాలించేవాడిని. అందరి హృదయాలలో నివశించే వాడిని. ఎవరయితే తమ దృష్టిని నావైపు తిప్పుకుంటారో వారికి ఎటువంటి హానిగాని, బాధగాని కలగదు. నన్ను మరిచిన వారిని మాయ శిక్షిస్తుంది. పురుగులు, చీమలు తదితర దృశ్యమాన చరాచరజీవకోటి అంతటా నా శరీరమే, నా రూపమే – బాబా

ఈ మాటలు అందరిలోనూ అంతర్యామిగా ఉండే స్వయం భగవానుడు తప్ప మరొకరు అనలేరు కదూ.

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।
అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ।।
గీత 10 - 20

ఓ అర్జునా, నేను సర్వ భూతముల హృదయములలో కూర్చుని ఉన్నాను. నేనే సర్వ ప్రాణుల ఆది, మధ్యము మరియు అంత్యము.

బాబావారు పైన చెప్పిన మాటలకూ, శ్రీకృష్ణుల వారు సనాతనం గా చెప్తూ వస్తున్నా గీత వాక్కుకు ఏమీ తేడా లేదు కదూ! భగవంతుడు చైతన్య రూపంలో ప్రతీ ప్రతీ ప్రాణి లోనూ, జ్యోతిరూపం లో ప్రతీ ఒక్కరి హృదయంతర్యామి గా ఉండి, కర్మల విషయంలో వారికి శక్తిని,

బుద్ధి ఇచ్చి, వారు చేసే పనిని సాక్షీభావంతో చూస్తూ ఉంటాడు .  వారి కర్మలను నిర్ధేశించడు.  కర్మ ని చెయ్యడం, చెయ్యకపోవడం; లేదా వారి సకామ-నిష్కామ కర్మలను కూడా శాసించడు.  ఎవరికీ వారి పూర్వ జన్మ సంస్కారాలు, లేదా వాసనలు, అభ్యాసం బట్టి వారికి నైపుణ్యం, బుద్ధి కుశలత, నడవడిక, దైవ భక్తి, వినయ పూర్వక వ్యవహారం ఇత్యాది సద్గుణాలు ప్రాప్తిస్తాయి.

భగవంతుడికి అన్నీ తెలిసినా, కేవలం సాక్షీభూతుడిగా వారి హృదయంలో అంతర్యామిగా ఉంటూ, వారి కర్మలను వీక్షిస్తూ వాటికి తగ్గ ఫలితాలను, వారి వారి సంచితాన్ని అనుసరించి, కర్మ క్షయానికి అవకాశం కల్పిస్తూ, వారిని నడిపిస్తూ ఉంటాడు.

తల్లి తన బిడ్డలను చూసుకునే రీతిలో ఎల్లప్పుడూ వారిని కనిపెట్టుకునే ఉంటాడు. అయితే వారి కరుణాపూరిత  చూపులు నోచుకుందుకు మనం చెయ్యల్సింది ఏమిటో బాబా మాటల్లోనే చూద్దాం.

ఎవరయితే తమ దృష్టిని నావైపు తిప్పుకుంటారో వారికి ఎటువంటి హానిగాని, బాధగాని కలగదు. నన్ను మరిచిన వారిని మాయ శిక్షిస్తుంది.

తానె ఆది మధ్యాంత రహిత పరమాత్మని అని బోధిస్తున్న బాబా, మరెవరో కాదు సాక్షాత్తు జగద్గురువు కృష్ణుడి పూర్ణ స్వరూపమే అని తెలియాలంటే బాబా గారు అన్న ఈ మాటలనే కృష్ణుల వారి పదాల్లో చూద్దాం.

దైవీ హ్యేషా గుణమయీ

మమ మాయా దురత్యయా ।

మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ।। గీత 7 -14

ప్రకృతి త్రిగుణాత్మకమైన నా దైవీ శక్తి, 'మాయ', అధిగమించుటకు చాలా కష్టతరమైనది. కానీ, నాకు శరణాగతి చేసిన వారు దానిని సునాయాసముగా దాటిపోగలరు.

మాయ అనేది అధిగమించటానికి చాలా కష్టమైనది. ఎవరైనా మాయను వశపరుచుకున్నారంటే వారు దైవాన్ని చేరుకున్నట్లే.  అటువంటి మాయ ఆ భగవానుడి ఇంటిలోని శునకం వంటిది.  తన దగ్గరకు వచ్చే ప్రతీ ఒక్కరిని తన ప్రతాపంతో భయభ్రాంతులను చేస్తూనే ఉంటుంది.  ఎప్పుడైతే యజమాని చూపు ఆ వచ్చే అతిధి మీద పడి, వారిని సాదరంగా చూస్తాడో, తన యజమాని చిత్తాని గ్రహించి అది తోక ఊపుతూ వారికి ఏ విధమైన బాధ కలిగించదు.

వారిని శరణాగతి చేస్తే, ఆ మాయా ప్రభావం నించి విముక్తిని ఇస్తాము అని గీతలో కృష్ణుడు, మన మధ్యే ఉంటూ బోధలలో మన బాబా వారు చెప్తున్నారు.  మరి ఇంతలా భక్తుల ఉద్ధరణ ధ్యేయంగా ఆ దయామయుడు చెప్తున్నా మనం పట్టించుకోవట్లేదు అంటే కారణం స్వామి వారి మాటల్లోనే చూద్దాం.

త్రిభిర్గుణమయైర్భావైరేభిః సర్వమిదం జగత్ ।
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ।। గీత 7 -13

మాయ యొక్క త్రిగుణములచే భ్రమకు లోనై (మోహితులై), ఈ లోకంలోని జనులు, అనశ్వరమైన మరియు సనాతనమైన నా గురించి తెలుసుకోలేకున్నారు.

త్రిగుణాలు ఎంత బలీయమైనవో మనం మొదట్లోనే తెలుసుకున్నాం.  వాటి మాయ లోంచి బయటపడడమే ముక్తి.  ఆ ముక్తిని మన చేరువలోకి తేవడమే భగవదవతారాల వైశిష్ట్యం. జన్మ ఎత్తాల్సిన అవసరం లేని భగవంతుడు యుగయుగాలుగా ఎన్నో అవతారాలు దాలుస్తూ మనల్ని ఈ జనన మరణ సంసారం నించి తరింప చేసే  మార్గాన్ని చూపుతూనే ఉన్నాడు.  అవేవీ మనకి పట్టకపోవడంతో ఇప్పుడు షిర్డీ సాయి రూపంలో మన చేతులు పట్టుకుని నడిపించడానికి అవతరించాడు.

ఈ మాయ ఏమి చేస్తుందో తెలిస్తే మనం కాస్త జాగరూకతతో ఉండవచ్చు మాయ చేసే పని

ఎంటంటే పరమేశ్వరుని నిజమైన స్వభావాన్ని కప్పివేసి ఉంచటం. మనిషిని తరింప చేసే సద్గురువు, సత్సంగం, సద్గ్రంథం, సాధు సేవ, సర్వభూత దయ, మానవ సేవ, విశిష్ఠ కర్మ ఇత్యాదుల నించి వారిని దూరం చేసి, లేని పోనీ మొహాల్ని చూపించి, వారిని త్రివిధ తాపాలకు గురిచేసి, దుఃఖాన్ని కలుగచేయడమే దాని ప్రధాన కర్తవ్యం. అటువంటి గొప్ప ఆపద నించి మనల్ని కాపాడడానికే మార్గాన్ని సుగమం చేశారు మన బాబా.

దానికి బాబా సూచించిన మార్గం చాలా సూక్ష్మం. "ఎవరయితే తమ దృష్టిని నావైపు తిప్పుకుంటారో వారికి ఎటువంటి హానిగాని, బాధగాని కలగదు. నన్ను మరిచిన వారిని మాయ శిక్షిస్తుంది".

తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।
తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ।। గీత 17 – 62

సంపూర్ణ హృదయ పూర్వకముగా కేవలం ఆయనకే అనన్య శరణాగతి చేయుము, ఓ భరతా. ఆయన కృపచే, నీవు పరమ శాంతిని మరియు నిత్యశాశ్వత ధామమును పొందెదవు.

మనం చెయ్యాల్సిందల్లా మన మనసుని బాబా వైపు తిప్పడమే. శరణాగతి కోరడం. పైన పేర్కొన్న 7.14వ శ్లోకం లో శ్రీ కృష్ణుడు చెప్పిందే బాబా వారు చెప్పారు.

అదే విషయము భాగవతం లోని ఉద్ధవగీత లో  ఇలా చెప్పబడింది.

మాం ఏకం ఏవ శరణం ఆత్మానం సర్వదేహినామ్
యాహి సర్వాత్మ-భావేన మయా స్యా హ్యకుతోభయః (11.12.15)

"ఓ ఉద్ధవా! సమస్త ప్రాపంచిక సామాజిక ఆచారాలనూ విడిచిపెట్టి, కేవలం, అన్ని ఆత్మలకు పరమాత్మ అయిన నాకు, శరణాగతి చేయుము. అప్పుడే నీవు ఈ భౌతిక భవ సాగరాన్ని

దాటి, భయరహితుడవు కావచ్చు."

"భగవత్ శరణాగతి చేసిన మరుక్షణం, జీవాత్మకు, దాని అనంతమైన పూర్వ జన్మల పాపరాశి, ఆయన కృపచే, భస్మమై పోతుంది." అని రామాయణం కూడా బోధిస్తోంది.

ఇన్ని ఇతిహాసాల సారాన్ని మనకి సరళ పదాల ఒద్దికలో, అందరికీ అర్ధమయ్యే రీతిలో బాబా వారు బోధించారు. అది కేవలం మన ఆత్మోన్నతికే అని గ్రహించడమే ముక్తికి తొలి మెట్టు.

సాయి సచ్చరిత్ర లో చెప్పినట్లు తల్లిప్రేమను సరిపోల్చదగినది ఏదీ లేదు. అది అసమాన్యము, నిర్వ్యాజ్యము. సద్గురువులు కూడా ఈ మాతృప్రేమ వారి శిష్యులపై చూపిస్తారు. సాయిబాబా అలాంటి ప్రేమను తనపై కురిపించారని హేమాడ్ పంతు చెప్తూ అది పొందడానికి ముఖ్యంగా “నాస్తికుల.. దుర్మార్గుల సహవాసం విడిచిపెట్టాలి. అందరితో అణుకువుగా, నమ్రతతో ఉండాలి. నన్ను హృదయపూర్వకంగా పూజించాలి. అలా చేస్తే శాశ్వత ఆనందాన్ని పొందవచ్చు” అని బాబా వారు మార్గం చూపినట్లు మనకు తెలుస్తోంది.

నాస్తికులు, దుర్మార్గుల విషయం చర్చించేముందు భగవంతుని దివ్యత్వం గురించి చూద్దాము.

జన్మ కర్మ చ మే దివ్యమ్<br>
ఏవం యో వేత్తి తత్త్వతః ।<br>
త్యక్త్వా దేహం పునర్జన్మ<br>
నైతి మామేతి సోఽర్జున ।।<br>
గీత 4-9 ।।

నా యొక్క జన్మ మరియు కర్మల దివ్య స్వభావాన్ని ఎవరైతే అర్థంచేసుకుంటారో, ఓ

అర్జునా, వారు తమ దేహం విడిచిపెట్టిన తరువాత తిరిగి జన్మనెత్తరు, నా నిత్యశాశ్వత ధామానికే వస్తారు.

అంటే ఎవరైతే భగవత్ తత్త్వాన్ని అర్థం చేసుకుంటారో వారు ఆత్మోన్నతి వైపు సాగుతున్నారు అని అర్థం. అంటే వారు జనన మరణ బంధాన్నించి బయట పడబోయే వైపు సాగుతున్నారు. అంత గొప్ప సౌభాగ్యానికి నోచుకోవాలంటే ఆయన దివ్యత్వాన్ని అంగీకరించి దానికి ప్రణతులు అర్పించడం మన కనీస బాధ్యతా కదా! సరే ఇక ఆయనని ఎలా తెలుసుకోవాలో చూద్దాం.

భక్త్యా త్వనన్యయా శక్య
అహమేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్వే
ప్రవేష్టుం చ పరంతప ॥
11-54 ॥

ఓ అర్జునా, అనన్యమైన భక్తి చేత మాత్రమే నేను నీ ముందే నిల్చుని ఉన్న నన్నుగా యదార్థముగా తెలుసుకోబడుతాను. ఓ పరంతపా, అందువలన నా దివ్య దృష్టిని పొందిన పిదప నాతో ఏకీభావ స్థితిని పొందవచ్చు.

అనన్య భక్తి ద్వారానే ఆయనను తెలుసుకోవడానికి కావాల్సిన దివ్య దృష్టి మనకు ఇవ్వబడుతుంది. భక్తి మాత్రమే మనలను భగవంతునితో ఏకం చేస్తుంది; ఆయనను దర్శించటానికి, పొందటానికి సహాయపడుతుంది.

అలాగే భగవంతుడు .. అది కృష్ణుడు కావచ్చు, మన బాబా వారు కావచ్చు.. వీరు ఇరువురూ నిజమైన భక్తికి దాసులై పోతారు. భగవంతుడిని దర్శిచడానికి కావలసింది భక్తీ అని భాగవతం, రామాయణం విశిష్ట శ్లోకాలలో ప్రతిపాదిస్తే, బాబా వారు అన్ని వాంగ్మయాలలో చెప్పిన విషయాన్ని కేవలం శ్రద్ధ-సబూరి అన్న ఆచరణీయ మార్గం ద్వారా

సాధించండి అని సులువుగా బోధించారు.

అలాగే మనం కర్మ చేసేప్పుడు ఏ భావంతో చేయాలో శ్రీకృష్ణుల వారు.. అదే విషయాన్ని తన నడతలో బాబాగారు చెప్పిన మార్గం చూద్దాం.

మత్కర్మకృన్మత్పరమో
మద్భక్తః సంగవర్జితః ।
నిర్వైరః సర్వభూతేషు
యః స మామేతి పాండవ ।।
గీత 11-55 ।।

ఎవరైతే అన్ని కర్మలనూ నా కొరకే చేస్తారో, నా పైనే ఆధారపడతారో మరియు నా పట్ల భక్తి తో ఉంటారో, మమకారాసక్తులు లేకుండా ఉంటారో, సర్వ భూతముల పట్ల విరోధభావము లేకుండా ఉంటారో, అటువంటి భక్తులు తప్పకుండా నన్నే చేరుకుంటారు.

ఇందులో మనకి కర్మ మార్గం, జ్ఞాన మార్గం, ధ్యాన-ధ్యేయ-ధ్యాత్రు స్వరూపం, కర్మ సన్యాసం, సమదృష్టి, సర్వ భూత దయ, ఇంద్రియజయం ఇత్యాదులన్నీ చెప్పబడగా, ఇదే విషయాన్ని మనకి ప్రతీక్షణం తన నడవడికలో చూపి, మనల్ని తరింప చేశారు బాబా వారు.

మరి ఇంత నుడివినా శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని గ్రహించని భారతం లోని దుష్ట చతుష్టయం లాగా, తమ మధ్యే మెలిగిన బాబా వారి దివ్యత్వాన్ని కూడా అంగీకరించని వారు లేకపోలేదు. వారిని అలా మాయలో పడేసే శక్తి ఏదో చూద్దాము.

త్రిభిర్గుణమయైర్భావై
రేభిః సర్వమిదం జగత్ ।
మోహితం నాభిజానాతి

మామేభ్యః పరమవ్యయమ్ ||

గీత 7-13 ||

మాయ యొక్క త్రిగుణములచే భ్రమకు లోనై (మోహితులై), ఈ లోకంలోని జనులు, అనశ్వరమైన మరియు సనాతనమైన నా గురించి తెలుసుకోలేకున్నారు.

త్రిగుణాలు ఎంతలా మనల్ని లేని పోనీ ఆకర్షణల వెంట పడేలా చేసి మనల్ని భగవత్ తత్త్వం తెలుసుకోవడం నించి విముఖులను చేస్తాయి. దాని ప్రభావంతో మామూలుగా అందరూ పడతాం. అయితే అందులో మరింతగా కూరుకుపోయి నాస్తికులుగా ఎలా మారతారో చూద్దాం.

ఆవృతం జ్ఞానమేతేన

జ్ఞానినో నిత్యవైరిణా |

కామరూపేణ కౌంతేయ

దుష్పూరేణానలేన చ ||

గీత 3-39 ||

అత్యంత వివేకవంతుల జ్ఞానం కూడా కోరికల రూపంలో ఉన్న శత్రువుచే కప్పివేయబడుతుంది, ఇది ఎప్పటికీ తృప్తిపఱుచలేనిది, అగ్నిలాగ మండుతూనే ఉంటుంది.

నాస్తికులు అని మనం అనుకునే వాళ్ళే ఒకప్పుడు చార్వాకులుగా పిలువబడే వారు. వీరిని భారతం లో కూడా  మనం చూడవచ్చు.  వీరు చాల తెలివైన వారు. అయితే వారికున్న జ్ఞానాన్ని విపరీత ధోరణిలో, దేవుడు లేదు అన్న ఒక్క విషయాన్ని ఎత్తి చూపడానికే మొగ్గుచూపుతూ ఉంటారు. అదే వారి కోరిక.. ధ్యేయంగా ఉంటుంది. అలాఎందుకు అని చూస్తే అది కేవలం మాయ ప్రభావం, అహం భావం, అంతా తమ చేతుల్లోనే ఉంది అన్న

మిధ్యావాదం ఇత్యాదులే తప్ప మరేమీ కాన రాదు.

అటువంటి వారి వైపు మనసు తిరిగినా, వారి సాంగత్యం తారసపడినా, మానవజన్మకు ధ్యేయమైన ఆత్మోన్నతికి దూరం కావడమే కాక, మరింత ఆత్మ పతనానికి దారి తీసే స్థితిలో పడి, భగవంతుడికి దూరం అవుతాము. ఎప్పుడైతే స్వామి కరుణాదృష్టి నించి దూరం అవుతామో, అదే మన దుస్థితికి నాంది అని గ్రహించాల్సి ఉంటుంది.

ఇంతటి విషయాన్ని చాల సూక్ష్మంగా తెలియచేస్తూ బాబా వారు హేమాద్ పంతుకు "నాస్తికుల.. దుర్మార్గుల సహవాసం విడిచిపెట్టాలి. అందరితో అణుకువుగా, నమ్రతతో ఉండాలి. నన్ను హృదయపూర్వకంగా పూజించాలి" అని సూచించారు. ఇక బాబా వారు సూచించిన శాశ్వత ఆనందం ఏమిటో చూద్దాం.

ఈ జగత్తును నడిపించు వాడను, సూత్రధారిని నేనే. ఇంద్రియ చాలకుడను నేనే.. పురుగులు .. చీమలు తదితర దృశ్యమాన చరాచర జీవకోటి అంతయు నాశరీరమే. నారూపమే - షిర్డీ బాబా.

ఈమాటలు ఒకసారి మధ్యాహ్న హారతి అయి తిరిగి వెళ్తున్న భక్తులతో బాబా వారు అన్నవి. వీటికీ .. శ్రీకృష్ణుల వారు గీతలో పలికిన క్రింది మాటలకు ఏమైనా తేడా ఉందో లేదో చూద్దాం.

మత్తః పరతరం నాన్యత్

కించిదస్తి ధనంజయ ।

మయి సర్వమిదం ప్రోతం

సూత్రే మణిగణా ఇవ ।।

గీత 7 - 7

నా కంటే ఉన్నతమైనది ఏదీ లేదు, ఓ అర్జునా. పూసలన్నీ దారము పై గుచ్చి ఉన్నట్టు

సమస్తమూ నా యందే ఆధారపడి ఉన్నవి.

బ్రహ్మ సంహిత కూడా ఇదే విషయాన్ని చెప్తూ ఇలా అంటుంది.

ఈశ్వరః పరమః కృష్ణః
సచ్చిదానంద విగ్రహః!
అనాదిరాదిర్ గోవిందః
సర్వ కారణకారణమ్!!

శ్రీ కృష్ణుడే పరమేశ్వరుడు; ఆయన సనాతనుడు (నిత్యుడు), సర్వజ్ఞుడు మరియు అనంతమైన ఆనంద స్వరూపుడు. ఆయన ఆది, అంతము లేనివాడు, అన్నిటికి మూలహేతువు, సర్వ కారణ కారకుడు"

అప్పుడు అన్న ఆ బోధనే ఇప్పుడు బాబా వారు మనకి గుర్తు చేసి తన పూర్ణావతార విషయాన్ని అనుభవ గ్రాహ్యంగా తేల్చారు.  అన్నిటికీ మూల సూత్రము తానే అని బాబా వారు తేల్చారు.  అలాగే తాను ఇంద్రియ చాలకుడను అని తెలియచేస్తూ మనకి వారి సర్వ నియామకత్వాన్ని గుర్తుచేస్తున్నారు.

పుణ్యో గంధః పృథివ్యాం చ
తేజశ్చాస్మి విభావసౌ ।
జీవనం సర్వభూతేషు
తపశ్చాస్మి తపస్విషు ।।
గీత 7 - 9

భూమి యొక్క స్వచ్ఛమైన వాసన ను నేను మరియు అగ్ని లోని తేజస్సును నేనే. సమస్త ప్రాణులలో జీవశక్తిని నేనే, మరియు తాపసులలో తపస్సును నేనే.

ఇంతలా తానే శ్రీకృష్ణుడను అని మనకు బాబా చాటిన ఉదంతాలు.. బోధలు ఎన్నో. ఇక మన వేదాల్లైతే "యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవాను పశ్యతి, సర్వ భూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే' అంటూ బాబా వారు ఆచరించి చూపిన మార్గాన్ని తేటతెల్లం చేస్తాయి.

ఎవరైతే అన్ని ప్రాణులనూ తమలో చూస్తారో, అన్ని ప్రాణులలోనూ తమను చూస్తారో అటువంటి వారికి రోత లేదా విద్వేషం కలగదు'. ఈమాట అంటున్నది వేదమే అయినా మనం విన్నది తరచూ బాబా వారి బోధల్లోనే కదూ.

ఇంకా లోతుగా చూడాలంటే
"ఓం సహనా వవతు, సహనౌ భునక్తు, సహవీర్యమ్ కరవావహై, తేజస్వి నావధీ తమస్తు మా విద్విషా వ హై" అని పలికిన వేద నాదాన్ని బాబా వారు ....

1. పరమాత్మ మనల్ని రక్షించాలి (అల్లాహ్ మాలిక్)
2. మాకు పోషణనివ్వాలి (సబ్ కా మాలిక్ ఏక్)
3. మాకు విద్యలలో సామర్థ్యం కలగాలి (విష్ణు సహస్రం, ఏకనాథ గీత, జ్ఞానేశ్వరి ఇత్యాది పారాయణ)
4. తేజస్వులైన మాకు బ్రహ్మవిద్య అవగతం కావాలి (సమ బుద్ధి, సర్వ భూత దయ, అంతర్యామి తత్త్వం),
5. మాలో మాకు విద్వేషాలు కలగకుండా ఉండాలి (శ్రద్ధ – సబూరి – అహంకారం క్రోధం ఇత్యాదులని త్యజించడం)

అన్నవి బోధించారు.

ఈ నిత్య పరిపూర్ణ సత్యాన్ని వేదం క్లిష్ట పదాల్లో బోధిస్తే, బాబా వారు అందరికీ అర్థం అయ్యే బాషలో తమ నడత లో చూపించారు.

ఈ జగత్తును నడిపించు వాడను, సూత్రధారిని నేనే అన్న బాబా వారి మాటలనే వేదపరిభాషలో చూస్తే అథర్వణ వేదం "బ్రహ్మ స్వరూపమే ఆత్మ.. ఆత్మయే బ్రహ్మం అని

నొక్కి ఒక్కాణిస్తూ "సర్వభూతేషు గూఢో ఆత్మ" అంటే సర్వ జీవులలోనూ ఆత్మా నిగూఢంగా ఉంటుంది అని బాబా వారి సర్వాంతర్యామి తత్వాన్ని చాటుతోంది.

ఇలా ఎన్నో విధాలుగా మనకి సాధారణంగా వినిపించే బాబా వారి బోధలలో మనం మూర్తీభవించిన పరిపూర్ణావతార లక్షణాలను దర్శించవచ్చు.

రాముల వారిని స్తుతిస్తూ రామాయణం లోని శ్లోకం ఇలా అంటుంది.

విద్వాస్ కః కః సమర్థశ్చ
కశ్చైక ప్రియదర్శనః .
ఆత్మవాస్ కో జితక్రోధో
ద్యుతిమాస్ కో ఉనసూయకః
కస్య బిభ్యతి దేవాశ్చ
జాతరోషస్య సంయుగే.

పరాక్రమశాలియు, గుణవంతుడు, ధర్మాధర్మముల నెరిగినవాడు, మేలు మరువని వాడు, ఆడినమాట తప్పనివాడు, తలచిన పని నేరవేరువరకు పట్టుదల విడువని వాడు,మంచి నడవడి కలిగినవాడు, సర్వభూతముల మేలుకోరువాడు, మంచి చెడ్డ లెరిగిన వాడు, నేర్పరి, అందరికీ ప్రియమైన దర్శనం కలవాడు, ధైర్యవంతుడు, కోపము లేని వాడు, కాంతితో కూడిన వాడు, ఇతరులపై అసూయ లేనివాడు, యుద్ధం లో దేవతలనైన వెరపించేవాడు.

మనలోని దుర్గుణాలు మనల్ని చీల్చి చెండాడుతుంటే, వాటినించి మనల్ని విడిపించడానికి శ్రద్ధ - సబూరి అన్న తారక మంత్రాన్ని అనుగ్రహించిన పరాక్రమశాలి మన బాబా.

త్రిగుణాలతో సతమతమౌతూ తప్పు మీద తప్పు చేస్తూ పోతున్న మనల్ని తరింప చేయడానికి వచ్చిన అవతారమే శుద్ధ సత్వ రూపుడైన మన బాబా.

ప్రేయో మార్గం .. శ్రేయోమార్గం గుర్తెరుగని అయోమయ స్థితిలో ఉన్న మనలను సరైన మార్గం లో పెట్టి ధర్మం- అధర్మం అన్న సందిగ్ధం నించి బయటపడేసిన మూర్తి స్వరూపమే మన బాబా.

తన భక్తులు తనకు చేసిన చిన్న సేవని కూడా మరువక, వారికిచ్చిన అభయానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటూ, వారికి ఇచ్చిన మాటకు కట్టుబడి, కన్న తల్లిలా తనను నమ్మిన వారి ప్రతీ కదలికనూ పరికిస్తూ, వారి బాగోగులు చూసుకుంటూ, వారిని కాపాడే బాబా తత్త్వం ఎందటో సాధారణ భక్తులకు అనుభవ గ్రాహ్యం.

నడవడిక ఎలా ఉండాలో కేవల బాధగా కాక, తన నడతలో చూపించి, సర్వ భూతదయ ను తన చేతల్లో చూపించి, తనను మన ఇంటిని అంటిపెట్టుకుని ఉండే ప్రతి ప్రాణి లో చూడమని, వాటి క్షుద్బాధ తీరిస్తే తనకు సేవ చేసినట్లే అని బోధించి, సర్వభూతదయను ఆచరణ రూపంగా నెరిపిన వాడు మన సాయి.

మంచి - చెడ్డ భేదం ఎరిగి, అర్థం ఎరిగిన వాడే కాక, అదేంటో విడమర్చి చెప్పి, తన చూపులతోనే అందరికి శాంతిని ఈరోజు కలగచేస్తున్న పైనం మన బాబా సొంతం.

కోపం - అసూయ లేక, కాంతి మాయ దేహం తో కూడి దైవీసంపత్తి ని కూడబెట్టుకున్న మహోజ్వల మూర్తి స్వరూపుడు మన బాబా అని ఏ ఒక్క హారతిని తిలకించినా మనకి అనుభవ గ్రాహ్యం అవడం గొప్ప విశేషం కదూ. ఈ లక్షణాలు వాల్మీకి రామాయణ శ్లోకంలో మూర్తీభవింప చేస్తే.. అంత భాషా పటిమ లేని సర్వులకు.. నాలాంటి అజ్ఞానులకూ, ఈరోజుకూ తమ దివ్య మంగళ దర్శనం తో పునీతులను చేస్తున్న బాబా వారి వైభవాన్ని, వేదాలు, వాదాలు, శ్రుతి, స్మృతి, పురాణాలు, నిగమ, ఆగమ విధానాలు, గీత భాష్యాలు దేనితో తరచి చూసినా మన మనో ఫలకంలో మకుటాయమానుడై శోభించే దివ్య స్వరూపుడే బాబా అని తెలిసిన నాడే మనం జ్ఞానమార్గం వైపు సాగుతున్నట్లు. అది కూడా వారి దివ్య వీక్షణ ఫలం అని గ్రహించి కృతార్థులం అవుదాం.

బద్ధకం, నిద్ర, చంచల మనస్సు, దేహాభిమానం మొదలైన వాటిని విడిచి, యావత్తు దృష్టిని సాయి బాబా కథల వైపు తిప్పవలెను - హేమాడ్ పంతు.

పై మాటలు హేమాడ్ పంతు తను తరించిన విధాన మార్గాన్ని సూచిస్తూ తెలియచేస్తాడు. అదీ బాబా అతనికి బోధించిన మార్గంగా భావించి దాని పూర్వాపరాలు చూద్దాం.

చిత్తవృత్తులు (గుణాలు) నీవే అని అనుకుంటే అది అజ్ఞానం. ఈ విషయం గీత అ.2 - 27 శ్లోకం (ప్రకృతే క్రియ మానాని) అన్న శ్లోకం లో మనం రెండు మూడు సార్లు చదువుకున్నాము. పరమాత్మ స్వరూపమైన ఆత్మ ఎప్పుడైతే ఒక ఉపాధిని (కారణ శరీరాన్ని) ఆశ్రయించి జన్మని తీసుకుంటుందో, అది జీవాత్మగా మారి ఈ సృష్టి లోని త్రిగుణాలతో మమైకమై, తన చుట్టూ జరుగుతున్న ప్రతీ విషయం లో తల దూర్చి, ప్రకృతి ధర్మం గా జరిగిపోతున్న విషయాలకు కూడా తను కర్తృత్వం ఆపాదించుకుని, సంబంధిత పాప పుణ్య వలయాలలో చిక్కుకుంటుంది.

ఎందుకంటే "ద్రష్టా దృశిమాత్రః శుద్ధోపి ప్రత్యయానుపశ్యః". ఆత్మ, ఎల్లప్పుడూ స్వచ్ఛమైనది, దేనికీ తాకకుండా ఉంటుంది. అయితే బుద్ధితో కలిసినపుడు దానికి రంగులు (గుణాలు) అంటుకుంటాయి.

"కృతార్థం ప్రతి నష్టం అనష్టం తదన్య సాధారణత్వాత". ఎవరైతే అలా తమ బుద్ధిలో చిక్కుబడిపోతారో, తామే అన్నీ చేస్తున్నట్లుగా భావిస్తుంటారు. దీనివల్ల అనేక బాధలు కలుగుతాయి" అంటుంది వివేక చూడామణి.

మరి ఈ త్రిగుణాలు ఇంతలా ఎందుకు బాధిస్తాయో ఇంతకు ముందే తెలుసుకున్నాం. విషయ అవగాహనకి అవసరం అయినంత గుర్తు చేసుకుందాం. ఈ అజ్ఞానం నుంచి బయట పడే మార్గం ఏమిటో తెలుసుకోడమే సాధన. తెలియబడేదే జ్ఞానం.

సత్వ, రజో, తమో గుణాలు మన ఆలోచనలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తూ ఉంటాయి. తమో గుణం అధికంగా ఉన్నపుడు నిస్సత్తువ, బద్ధకం కలుగుతాయి. రజోగుణం అధికమైనపుడు మనసు అసహనంగా, అనేక కోరికలతో నిండి ఉంటుంది. అది చివరికి చెడు మార్గానికి దారి తీసి, అధోగతికి చేరుస్తుందని తెలిసి, మన బాబా వారు వాటి నించి మనల్ని దూరం చేయడానికని ఈ గ్రంధ రచయిత ద్వారా మనకి తెలియచేశారు.

ఇదంతా మాయా ప్రభావం. ఇది అర్ధం చేసుకుందుకు మనం వేదాలని ఆశ్రయించడం తప్పదు.

భ్రమేణాహం భ్రమేణత్వం | భ్రమేణోపాసకాజనాః!
భ్రమేణేశ్వరభావత్వం | భ్రమమూలమిదంజగత్ ||

వేదాంతం లోని ఎన్నో విషయాలని, వాటిని ఎక్కడనించి మనకి బోధిస్తున్నారో చెప్పకుండానే, ఆ విషయాలని చాల సాధారణ పరిభాష లో చెప్పేవారు షిర్డీ బాబా. ఈలోకం లో మనం అనుభవిస్తున్న భోగాలకు, బాధలకు, అశాశ్వత విషయాలకై పరిగెత్తే మన నైజానికి, మోహంతో ప్రతీ ఆకర్షణకి లొంగిపోయే స్వభావానికి కారణం మాయ. అదే అవిద్య. ఈ మాయ అయిదు విధాలుగా తెలియ బడుతోంది.

మాయ, తమస్సు, మోహము, అవిద్య, అనృతాత్మికము. ఈ మాయ ప్రభావం వలన మనం అనిత్య వస్తువును నిత్యమైనది గాను, అశౌచాన్ని శౌచమైనది గాను, దుఃఖమును సుఖంగాను చూస్తాము. ఇదే భ్రాంతి. ఇదే మాయ. ఇదే అజ్ఞానం,

దీని నుంచి బయట పడే మార్గం జ్ఞాన మార్గం. కాపోతే కేవల జ్ఞానార్జనే దానికి విరుగుడు కూడా కాదు. ఆ తెలుసుకున్న జ్ఞానాన్ని అనుష్ఠించాలి. అప్పుడు దాని లాభం ఒనగూరుతుంది. దీనికి విరుగుడుగా ఎన్నో మార్గాలు ఉన్నా, భక్తి మార్గం అందరికి సులభ గ్రాహ్యమైనది. దానినే తన భక్తులకు బాబా వారు బోధించారు.

తమో గుణ లక్షణాలైన బద్ధకం, నిద్ర, చంచల మనస్సు, దేహాభిమానం మొదలైన వాటిని విడిచి, యావత్తు దృష్టిని సాయి బాబా కథల వైపు తిప్పవలెను అని హేమాడ్ పంతు ద్వారా చెప్పించి, మనకు తరించే మార్గాన్ని బోధించారు. భక్తీ అన్నారు కదా అని దానికి బాహ్య లక్షణాలైన వేష భాషలు, పండిత పాటవాలు చూపించాల్సిన అవసరం లేదంటూ, తానూ ఒక సాధారణ ఫకీర్ లా ఉండి, ఎటువంటి పండితులకూ తగ్గని జ్ఞానం కలిగి ఉన్నా కూడా, పైకి సాధారణ సాధకునిలా గోచరిస్తూ, తనని ఆశ్రయించిన వారికి, సరైన మార్గం చూపిస్తూ, అందరిని తరింప చేశారు మన బాబా.

భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలు మూడింటిని మేళవించి, వీటిని ఒకే మార్గంలో ఆచరించడం సాధ్యమని బాబా స్వయంగా తాను ఆచరించి సామాన్యులకు చూపారు. భక్తికి ప్రాధాన్యం ఇచ్చారు కదా అని మంత్ర తంత్రాలకు, లేదా ఒక యోగ మార్గానికో, లేదా ప్రత్యేక పూజా విధానానికో ఆయన ప్రాధాన్యత ఇవ్వలేదు. అంతర్యామిని దర్శించమన్నారు. అలా అని దానికి ఏదో పెద్ద ప్రయత్నం గా కాక తనకు జీవితం లో తారస పడే ప్రతీ పనిలో, సాధనలో, వ్యక్తిలో, పరిస్థితిలో, ఆ భగవంతుడిని చూస్తూ, అన్ని పనులను ఆయనకే అర్పిస్తూ, తరించమని బోధించారు.

అందరిలోనో ఉన్నది ఒకే ఆత్మ అని గ్రహించి, సర్వ భూత దయను చూపిస్తూ, భక్తుల చెడు కర్మలను తానే అనుభవించి, భక్తులకు మాత్రం వారి అర్హతని బట్టి సుఖాన్ని ఒనగూర్చిన బాబా వైనం మనకి ఎన్నో చోట్ల కనిపిస్తుంది. అలా కోరికలు తీర్చే చేత్తోనే జ్ఞానాన్ని ప్రసాదించే భక్తిముక్తిదాయక స్వరూపుడైన మన బాబా గురించిన మూడో అధ్యాయాన్ని ముగించుకుని, తరువాత నాలుగవ అధ్యాయం చూద్దాం.

3వ ఆధ్యాయం సంపూర్ణం